పథకం కోసం తరలించిన పైపులు



హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు ఊహాచిత్రం



నాడు రూ.714 కోట్లు.. నేడు రూ.930 కోట్లు

హ్యాపీనెస్టు గేటెడ్ కమ్యూనిటీలోని ఫ్లాట్లను కొనుగోలుదార్లకు 2021 నాటికే అప్పగించాలి. అయితే వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో ప్రాజెక్టు పనులు అటకెక్కాయి. తొలుత రూ.714 కోట్ల ప్రాజెక్టును షాపూజీ పల్లోంజీ పనులు చేపట్టగా రివర్స్ టెండరింగ్ అంటూ జగన్ ప్రభుత్వ నిర్ణయంతో పనులు నిలిచిపోయాయి. ఈ పరిస్థితుల్లో విపరీతమైన జాప్యంతో నిర్మాణ వ్యయం ప్రస్తుతం రూ.930 కోట్లకు పెరిగింది. గత డిసెంబరులో టెండర్లను పిలవగా ఎన్‌సీసీ సంస్థ ప్రాజెక్టును దక్కించుకుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.25 (మంగళవారం సాయంత్రం) సహరి : 4.52 (బుధవారం ఉదయం)

మళ్లీ.. హ్యాపీనెస్ట్



రాజధాని అమరావతిని అత్యద్భుతంగా నిర్మించే క్రమంలో అత్యాధునికంగా.. ఆహ్లాదకరంగా.. అంతర్జాతీయ స్థాయి వసతులతో హ్యాపీనెస్ట్ పేరుతో గృహ సముదాయాలకు గత టీడీపీ ప్రభుత్వం సంకల్పించింది. ప్రజల నుంచి ఊ హించని స్పందన రావడంతో ఫ్లాట్ల బుకింగ్‌లు శరవేగంగా జరిగాయి. ఇక రాజధానిలో తమ కలల గృహం.. కృష్ణా నదీ సమీపంలో నేల పాడులో నిర్మాణం జరుగుతుందని ఫ్లాట్ల కొనుగోలుదారులు ఆనంద డోలికల్లో ఉన్నారు. అయితే వారి కలలను కల్లలు చేస్తూ.. వారి ఆశ లను చిదిమేస్తూ గత వైసీపీ ప్రభుత్వం అమరావతి తో పాటు హ్యాపీనెస్టు ప్రాజెక్టును కూడా పక్కన పెట్టేసింది. రూ.లక్షలు చెల్లించిన వారు గత ఐదేళ్లు ఆందోళనలో ఉన్నారు. ఈ క్రమంలో మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం..

అమరావతిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించడంతో హ్యాపీనెస్టు కొనుగోలుదారుల్లో ఆశలు చిగురించాయి. వైసీపీ ప్రభుత్వం అటకెక్కించిన హ్యాపీనెస్టు ప్రాజెక్టును చంద్రబాబు పట్టాలపైకి తీసుకురావడంతో కొను గోలు దారుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నా యి. జగన్ ప్రభుత్వమే తమను మోసం చేసిందని ఆందోళన చెందుతున్న ఫ్లాట్ల కొనుగోలుదార్లకు కూటమి ప్రభుత్వం అభయమిచ్చి పాత రేట్లపైనే నిర్మాణా లు పూర్తి చేసి అప్పగించేలా విధాన నిర్ణయాన్ని ప్రకటించింది. హ్యాపీనెస్ట్ ప్రాజెక్టుకు సీఆర్‌డీఏ రీ టెండర్లు నిర్వహించగా నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ పను లను దక్కించుకుంది. త్వరలో హ్యాపీనెస్టు పనులు ప్రారంభం కానున్నాయి.

కొనుగోలు దార్లకు అభయం

- ప్రాజెక్టును పట్టాలెక్కిస్తోన్న ప్రభుత్వం
- రీ టెండర్.. నేలపాడులో పనులు ప్రారంభం
- పాత రేట్లపైనే పూర్తి చేసి అప్పగిస్తామని ప్రకటన
- జగన్ నిర్వాకంతో రూ.216 కోట్లు పెరిగిన వ్యయం

ప్రాజెక్టు స్థలం వద్ద జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న ఎక్స్‌కవేటర్



(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

రాజధాని అమరావతిలో జనాభాను పెంచే లక్ష్యంతో 2017-18లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హ్యాపీనెస్ట్ ప్రాజెక్టును చేపట్టింది. నేలపాడు వద్ద హ్యాపీనెస్ట్ పేరుతో గేటెడ్ కమ్యూనిటీని నిర్మించేందుకు సన్నాహాలు చేసింది. అయితే ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతితో పాటు హ్యాపీనెస్టు ప్రాజెక్టును అటకెక్కించింది. దీంతో హ్యాపీనెస్ట్‌లో ఫ్లాట్ల కోసం డబ్బులు చెల్లించిన అనేకమంది గగ్గోలు పెట్టారు. కొందరు ఒత్తిడి చేసి డబ్బులను వెనక్కు తీసుకోగా.. మరికొందరు దింపుడు కళ్లెం ఆశతో ఎదురుచూశారు. 2024లో తిరిగి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు హ్యాపీనెస్ట్‌కు డబ్బులు చెల్లించిన వారందరికీ తీపి కబురు చెప్పారు. ఐదేళ్లపాటు ఆలస్యమైనా.. నిర్మాణ వ్యయం రూ.216 కోట్ల మేర పెరుగుతున్నా దానిని సీఆర్‌డీఏనే భరిస్తుందంటూ బాధిత ఫ్లాట్ల దారులకు అభయమిచ్చి వారిలో ప్రభుత్వంపై నమ్మకాన్ని కల్పించారు.

2బీ+జీ+18 అంతస్తులుగా 12 టవర్లు

హ్యాపీనెస్ట్ ప్రాజెక్టును గత టీడీపీ ప్రభుత్వం

(మిగతా 6వ పేజీలో)

అనుసంధానం.. ఆలస్యం

- గోదావరి జలాలు బనకచర్లకు తరలింపుపై ఖరారు కాని డిజైన్
- భూ సేకరణ ప్రక్రియను నిలిపేసిన రెవెన్యూ శాఖ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నదుల అనుసంధానానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ.. 2026 జూన్ కల్లా పూర్తి చేయడమే లక్ష్యంగా చేపట్టిన జలహారతి ప్రాజెక్టు ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. జలహారతి పేరుతో చేపట్టిన పనులు భూ సేకరణ దశలోనే ప్రస్తుతానికి ప్రభుత్వం ఆపేసింది. జలహారతిలో గోదావరి-బనకచర్ల అనుసంధానానికి ప్రభుత్వం గతంలో ప్రణాళికను విడుదల చేసింది. ఈ పనులకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియను కూడా ప్రారంభించింది. అయితే ఇంత వరకు ప్రక్రియ వేగంగా జరగడంతో గోదావరి జలాలు కుడి కాల్వకు వచ్చే కాలం అతి దగ్గరలోనే ఉందని ఆయకట్టు రైతులు ఆశపడుతున్నారు. అయితే వారిని నిరాశపరుస్తూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టు భూసేకరణ దశలో నిలిపివేయడంతో కుడి కాల్వకు గోదావరి జలాలు తరలించే ఎత్తిపోతల పథకం నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రైతులు అసంతృప్తికి లోనవుతున్నారు.



నకరికల్లులో గోదావరి జలాల ఎత్తిపోతల పథకానికి నాడు సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన శంకుస్థాపన శిలాఫలకం

ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూపు

జలహారతి తొలివిడత ప్రయోజనం నాగార్జున సాగర్ జవహర్ కుడి కాల్వ ఆయకట్టు రైతులు పొందుతారు. గోదావరి జలాలను బొల్లాపల్లి జలా శయంలో నిల్వ చేసి అక్కడి నుంచి బనకచర్ల రెగ్యులేటర్‌కు తరలించేందుకు ప్రభుత్వం తొలుత నిర్ణయించింది. ఈ మేరకు భూసేకరణ చేపట్టారు. ఈ పనులను మూడు దశల్లో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలిదశలో గోదావరి జలాలు 73 టీఎంసీలు మళ్లించి కుడి కాల్వ ఆయకట్టు 9.61 లక్షల ఎకరాలకు నీరు అందించాలన్నది ప్రధాన ఉద్దేశం. రూ.6020 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించగా రూ.465 కోట్ల పనులు పూర్తయ్యాయి. రెండో ప్యాకేజీలో రెండు పంపు హౌస్ లు నిర్మించాలి. 5.65 కిమీ మేర ఆరు వరసల పైపులు ఏర్పాటు చేయాలి. మరో 15.95 కిలో మీటర్లు కాల్వ తవ్వాలి. రెండు సబ్ స్టేషన్లు నిర్మిం చాలి. ఈ ప్యాకేజీలో రూ.550 కోట్ల పనులు పూర్తి చేశారు. మరో 2,105.82 కోట్ల పనులు చేయాల్సి ఉంది. రెండు ప్యాకేజీలకు సంబంధించి సుమారు 466.31 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉంది. ఇందుకు రూ.181 కోట్ల వ్యయం అవుతుందని రెవెన్యూ శాఖ అంచనా వేయగా ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించింది. దీంతో భూ సేకరణకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ దశలో గోదావరి జలాలను బనకచర్లకు తరలించే ప్రాజెక్టు డిజైన్‌లో మార్పులు చేయాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ డిజైన్‌కు తుది రూపు వచ్చే వరకు భూసేకరణను వాయిదా వేశారు. దీంతో భూసేకరణను రెవెన్యూ శాఖ నిలిపివేసింది. డిజైన్‌ను ప్రకటించిన అనంతరమే భూసేకరణ ప్రారంభించాలని ప్రభుత్వం సూచించినట్లు అధికారులు చెబుతున్నారు. అమరావతి, క్రోసూరు, రాజుపాలెం నకరికల్లు మండలాల పరిధిలో భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ నిర్ణయం కోసం రెవెన్యూ అధికారులు ఎదురుచూస్తున్నారు.

ప్రథమ పౌరులుగా గుర్తించాలి

- రైతుల ప్లాట్లలో వచ్చే వసతులన్నీ గ్రామాల్లోనూ కల్పించాలి
- సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుకు రాజధాని గ్రామాల రైతులు వినతి
- ప్రతీ గ్రామానికి డీపీఆర్ :ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): 'రాజధాని అమరావతి పరిధిలోని గ్రామాల్లో 2014 డిసెంబరు 8 వరకు నివాసం ఉంటున్న వారిని ప్రథమ పౌరులుగా గుర్తించాలి. గత టీడీపీ ప్రభుత్వం కల్పించిన ఉచిత విద్య, వైద్యాన్ని పునః ప్రారంభించాలి. అప్పట్లో ఇచ్చిన హెల్త్ కార్డులు ఇప్పుడు పని చేయడం లేదు. తిరిగి పథకం అమలు చేయాలి..' అని రాజధాని గ్రామాల రైతులు, కూలీలు సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబును కోరారు. రాజధాని గ్రామాల రైతులు, కూలీలతో సోమవారం తుళ్లూరులోని హెచ్‌ఎస్‌ఆర్ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలు సమస్యలను రాజధాని గ్రామాల రైతులు కమిషనర్, ఎమ్మెల్యేకి ఏకరువు పెట్టారు. గత వైసీపీ ప్రభుత్వం ముంపు ప్రాంతమని అమరావతిని అవహేళన చేసిందని, ఈ పరిస్థితుల్లో పూడిపోయిన వాగులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని రైతులు సూచించారు. రైతుల ప్లాట్లలో వచ్చే వసతులన్నీ గ్రామాల్లోనూ కల్పించాలన్నారు. రాజధానిలో పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.12 వేలు ఇస్తున్నారని దానిని మున్సిపాలిటీల్లో ఇస్తున్నట్లు రూ.21 వేలకు పెంచాలని సీపీఎం రాష్ట్ర సహాయక కార్యదర్శివర్గసభ్యుడు సీహెచ్ బాబురావు తెలిపారు. రాజధాని గ్రామాలలో పేదలకు ఉచిత సోలార్ పథకం అమలు చేయాలన్నారు. గ్రామ కంఠాల సమస్యలను పరిష్కరించాలన్నారు. అసైన్డ్ రైతులు కొందరికే కౌలు జమయ్యాయని మిగిలిన వారికి జమ చేయాలని దళిత జేఏసీ నేత చిలకా బసవయ్య తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ రైతులు చెప్పిన సమస్యలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాజధాని నిర్మాణాలను ఎంత వేగంగా చేస్తున్నామో అంతేవేగంగా గ్రామాల అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. రైల్వే ట్రాక్‌కు స్వచ్ఛందంగా భూములు ఇచ్చేందుకు పెదపరిమి, తాడికొండ రైతులు ముందుకొస్తున్నారన్నారు. హామీ లేకుండా రూ.25 లక్షల వరకు ఇచ్చే రుణాలను అమలు చేయాలన్నారు. గ్రామాల అప్రోచ్ రోడ్ల పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామాల వారీగా డీపీఆర్లు తయారు చేసి పూర్తి మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అమరావతి పింఛన్ అమలు చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, పక్కన ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్



సమావేశానికి హాజరైన రైతులు, రైతు కూలీలు

కలెక్టర్ల సదస్సుకు.. సిద్ధం

- రేపు జిల్లా ప్రజంటేషన్ ఉండే అవకాశం
- అధికారులతో సమావేశమై సమాచారం సేకరణ



గుంటూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వా త జరగనున్న మూడో కలెక్టర్ల సదస్సుకు గుంటూరు జిల్లా కలెక్టర్ నాగ లక్ష్మి పూర్తిస్థాయిలో సమాయత్తమయ్యారు. ఒకవైపు సదస్సు నిర్వహణ ఏర్పాట్లు చూసుకుంటూనే మరోవైపు జిల్లాకు సంబంధించిన కీలక అంశా లను ప్రజంటేషన్‌లో పొందుపరిచి సీఎం, మంత్రులు, ప్రిన్సిపల్ సెక్రటరి, వివిధ శాఖల ఉన్నతాధికారుల సమక్షంలో నివేదించనున్నారు. తొలి రోజునే తొమ్మిది జిల్లాల కలెక్టర్లు తమ ప్రజంటేషన్లు ఇవ్వనుండటంతో రాష్ట్రంలోనే అమరావతి రాజధాని కలిగిన కీలకమైన గుంటూరు జిల్లా ప్రజంటేషన్ కూడా ఉంటుందని జిల్లా అధికారవర్గాలు భావించాయి. అయితే ప్రభుత్వం నుంచి అందిన సమాచారం మేరకు బుధవారం గుం టూరు జిల్లా ప్రజంటేషన్ ఉంటుందని సోమవారం రాత్రి తేలింది. జీడీడీపీ(గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్టు), జీవీఏ(గ్రాస్ వాల్యూ యాడెడ్) విషయంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి 15 శాతం వృద్ధి సాధించేందుకు కార్యాచరణ ప్రణాళిక గురించి 10 నిమిషాల పాటు ప్రజంటేషన్ ఇచ్చేందుకు అవకాశం కల్పించారు. అలానే ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి నిర్ణయం తీసుకోవాల్సిన జిల్లాకు సంబంధించిన ప్రత్యేకమైన అంశాలపై ఐదు నిమిషాలు పాటు కలెక్టర్ ప్రసంగిస్తారు. జిల్లా అభివృద్ధికి దోహదపడే అంశాలపై నివేదించేందుకు ప్రత్యేకంగా సమయం కేటాయించినందున దానిని సద్వినియోగం చేసుకునేందుకు కలెక్టర్ నాగలక్ష్మి సోమవారం జిల్లా అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. తన ప్రజంటేషన్‌కు తుది మెరుగులు దిద్దారు. జీడీడీపీకి సంబంధించి ప్రధానంగా చేనేత వస్త్రాలు, పాలు, పౌల్ట్రీ ఉత్పత్తులకు పెట్టింది పేరు. అలానే ధాన్యం, మిర్చి ఉత్పత్తి ఎక్కువగా జరిగి ఎగుమతి అవుతుంటాయి. పొదుపు సంఘాల మహిళలు కూడా వివిధ రకాల ఆహార పదార్థాలు, వస్తువులు ఉత్పత్తి చేసి ఈ-కామర్స్ ద్వారా కూడా మార్కెటింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా రంగాల్లో ఉత్పత్తిదారులకు మార్కెటింగ్ వంటి సదుపాయాలు విస్తరింప చేసి జీడీడీపీ పెరుగుదలకు కృషి చేస్తున్నామని కలెక్టర్ నివేదించనున్నారు. మంగళగిరి వద్ద జాతీయ రహదారికి ఇరువైపులా ఆకాశ హర్మ్యాల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. మంగళగిరి వద్దనే గోల్డ్, ఐటీ, చేనేత పార్కులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు ప్రభుత్వం నుంచి తోడ్పాటు అవసరం అవుతుంది. ఉప్పలపాడులోని పక్షుల కేంద్రాన్ని సకల సదుపాయాలతో అభివృద్ధి చేయాలి. ఎన్‌టీఆర్ మానససరోవరం పార్కుకు పూర్తి వైభవం అవసరం. అలానే ఉండవల్లి గుహలు, మంగళగిరిలోని పానకాల స్వామి ఆలయం వంటివి అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉన్నది. ప్రత్తిపాడు వద్ద మెడికల్ హబ్ ఏర్పాటు అవుతున్నది. మిర్చియార్డుని కూడా ప్రత్తిపాడు నియోజకవర్గంలోకి తరలించాలన్న ప్రతిపాదనకు ప్రభుత్వం కూడా ఆమోదం తెలిపింది. ఆయుష్, 100 పడకల ఈఎస్‌ఐ ఆస్పత్రులకు స్థలాలను చూపించాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో వీటిని నివేదించి ప్రభుత్వ సహకారం కోరాలని కలెక్టర్ నిర్ణయించారు. నియోజకవర్గానికి ఒక ఇండస్ట్రియల్(ఎంఎస్‌ఎంఈ) పార్కు ఏర్పాటుని కూడా ప్రతిపాదించనున్నారు.

అమరావతికే ప్రత్యేకాకర్షణ.. 8

సెంట్రల్ పార్కు



- శాఖమూరులో 300 ఎకరాల్లో ఏర్పాటు
- పార్కు మధ్య భారీ జలాశయం
- చుట్టూ పార్కులు, వినోద కేంద్రాలు
- హైలెట్‌గా వైల్డర్‌నెస్ పార్కు
- ఆరంభమైన పనులు



8

ఎయిర్ ట్యాక్సీ @ గుంటూరు

- అత్యాధునిక ప్రయాణ సాధనాన్ని ఆవిష్కరించిన గుంటూరు కుర్రోడు
- కేంద్రం అనుమతిస్తే ఎయిర్ అంబులెన్స్‌గా వాడుకునే అవకాశం

అచ్చంపేట సీఐ వెంకట ప్రసాద్ పై వేటు 8

- వీఆర్‌కు పంపుతూ ఐజీ ఆదేశాలు

గన్నవరం రైతులకు 227 రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు 8

స్కూల్ కాంప్లెక్స్‌లకు రూ.28.09 కోట్లు నిధులు మంజూరు

రూ. 63 లక్షల పంచాయతీ నిధుల స్వాహా


సర్పంచ్ నోముల కృష్ణ

● కొప్పునూరు వైసీపీ సర్పంచ్ చెక్ పవర్ రద్దు..?
● షోకాజు నోటీసు జారీ.. ● డీపీవో విచారణ

మాచర్లటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో అభివృద్ధి పనుల కోసం మంజూరైన పంచాయతీ నిధులను ఆ గ్రామ సర్పంచ్ తన పలుకుబడితో అప్పటి పంచాయతీ సెక్రటరీతో కలిసి స్వాహా చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మాచర్ల మండలంలోని కొప్పునూరు గ్రామ పంచాయతీకి గత వైసీపీ ప్రభుత్వంలో రూ. 63 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఆ గ్రామ సర్పంచ్ నోముల కృష్ణ ఆ నిధులను కాజేసి తన జేబులో వేసుకున్నాడు. అప్పటి ప్రభుత్వంలో పలుకుబడి ఉన్న నేతల సహకారం ఉండడంతో అధికారులు కూడా ఎదురు చెప్పలేక జీహుజూర్ అన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు కోసం వెచ్చించాల్సిన ఆ నిధులను ఏ పనులు చేయకుండానే అభివృద్ధి పనులు చేసినట్లు తీర్మానం చూపించి సొమ్మంతా డ్రా చేసుకున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సర్పంచ్ నిధులు దుర్వినియోగాన్ని గ్రామస్థులు శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో డీపీవోను విచారణ చేపట్టాలని లేఖ రాశారు. దీంతో అధికారుల తనిఖీలో సర్పంచ్ కృష్ణ ఖాతాకు రూ. 51 లక్షలు, బూడిద సైదులు ఖాతాకు రూ. 3 లక్షలు, పంచాయతీ డీఈవో జానీబాషాకు రూ. 2.50 లక్షలు జమ అయినట్లు గుర్తించారు. ఈ పంచాయతీ పరిధిలో ఉన్న న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి రూ. 6 లక్షలు పన్ను చెల్లించినా పంచాయతీ అకౌంట్‌కు జమ కాలేదని అధికారులు నిగ్గు తేల్చారు. నిధుల దుర్వినియోగంలో పంచాయతీ అధికారుల పాత్ర కూడా ఉండడంతో తమను కాపాడాలని ఉన్నతాధికారుల వద్ద లాబీయింగ్‌కు దిగినట్లు తెలుస్తోంది. పంచాయతీ కార్యాలయ అధికారులు సర్పంచ్ కృష్ణకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లా ఉన్నతాధికారులు అప్రమత్తమై సర్పంచ్ కృష్ణ చెక్‌పవర్ రద్దు చేసినట్లు సమాచారం. ఉన్నతాధికారులు రెండు దఫాలుగా నోటీసులు ఇచ్చినా సర్పంచ్ నోముల కృష్ణ నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో ఉన్నతాధికారులు చర్యలకు సిద్ధమయ్యారు.

ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాగానే చర్యలు తీసుకుంటాం : ఎంపీడీవో

కొప్పునూరు సర్పంచ్ నోముల కృష్ణ నిధులు దుర్వినియోగం అంశం పంచాయతీ శాఖ జిల్లా ఉన్నతాధికారి (డీపీవో) దృష్టిలో ఉందని, చెక్‌పవర్ కూడా నిలిపివేయడం జరిగిందని, త్వరలోనే డీపీవో కొప్పునూరు పంచాయతీని పరిశీలించి చర్యలు తీసుకుంటారన్నారు. ప్రస్తుతానికి కొప్పునూరు పంచాయతీ బాధ్యతలు ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు నిర్వహిస్తున్నారని ఎంపీడీవో ఫణికుమార్ నాయక్ తెలిపారు.

బాపట్ల శిక్షణా కేంద్రానికి ఇద్దరు ఎంపీడీవోల బదిలీ

గుంటూరు సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు ఎంపీడీవోలను బాపట్ల మానవ వనరుల శిక్షణా కేంద్రానికి గజిటెడ్ ఫ్యాకల్టీగా బదిలీ చేశారు. పెదకూరపాడు ఎంపీడీవో పీ రామకృష్ణ, చేబ్రోలు ఎంపీడీవో కే లలితను బాపట్ల శిక్షణా కేంద్రానికి బదిలీ చేయాలని పీఆర్ కమిషనర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో వారిని విధుల నుంచి రిలీవ్ చేస్తూ జడ్పీ సీఈవో జ్యోతి బసు సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేశారు.

14 నెలలుగా జీతాలు అందక అవస్థలు

జడ్పీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆవేదన

గుంటూరు సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్‌లోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆకలితో అలమటిస్తున్నారు. గడచిన 14 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. జిల్లా పరిషత్‌లో ఆరుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. జిల్లా పరిషత్‌లోని ఇప్పటి పాలక వర్గం మొట్టమొదటి సమావేశంలో అనుమతి పొందిన తరువాత వారిని విధుల్లోకి తీసుకున్నారు. విధుల్లో చేరిన తర్వాత నెలకు రూ. 15000 చొప్పున జీతాలు చెల్లించారు. డిప్యూటీ సీఈవో మోహన్‌రావు ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత వారికి జీతాల చెల్లింపులు నిలిపివేశారు. జీతాల చెల్లింపు కోసం పాలకవర్గం రూ.14 లక్షలు కేటాయించినా అధికారులు మాత్రం కనికరం చూపడం లేదన్న వాదన వినిపిస్తోంది. పెండింగ్ జీతాలు చెల్లించి తమ కుటుంబాలను ఆదుకోవాలని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరుతున్నారు.

విద్యుత్ వాహన వినియోగం పెరగాలి

ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు విద్యుత్ ఆధారిత వాహనాల వినియోగం పెరగాలని ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు అన్నారు. విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో



ప్రసంగిస్తున్న వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు

ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ వెహికల్ టెక్నాలజీ అనే అంశంపై రెండు రోజుల యూజీసీ జాతీయ వర్క్ షాప్ సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్‌కు వచ్చే విషవాయువులు ప్రజారోగ్యంపై దీర్ఘకాలిక ప్రతికూల ప్రభావం చూపిస్తాయన్నారు. భవిష్యత్తు అంతా ఎలక్ట్రికల్ వాహన వినియోగంపై దృష్టి సారిస్తారని పేర్కొన్నారు. బీజేపీ విద్యుత్ శాఖ ఓఎస్డీ ఏవీ సాంబశివరావు మాట్లాడుతూ విద్యుత్ వాహన టెక్నాలజీలో విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. టెక్నికల్ మేనేజర్ మంజునాథ కులకర్ణి మాట్లాడుతూ డిజైన్ మోడల్ విద్యుత్ వాహనాలు మోటార్ సెలక్షన్ టార్క్ క్యాలిక్యులేషన్స్ అనే అంశాలను వివరించారు. అనంతరం వర్క్ షాపు డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ రవికుమార్ మాట్లాడుతూ విద్యుత్ వాహనాల్లో ముఖ్యమైనది బ్యాటరీ టెక్నాలజీస్ అన్నారు. ఫాస్ట్ చార్జింగ్ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏసీ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య కృష్ణ సత్య, ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం గోపీకృష్ణ, డాక్టర్ డీ చంద్రమౌళి, విభాగం కోఆర్డినేటర్ ఎం వీ ఉమామహేశ్వరి, ఆర్ఎస్ శ్రీనివాస్, ఏడీ రాజాజీ, డాక్టర్ సీహెచ్ పుణ్యశేఖర్, కోటిరెడ్డి, విభాగం టెక్నీషియన్స్ ప్రసాద్, అజయ్ బాబు, మనోహర్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మళ్లీ.. హ్యాపీనెస్ట్

(5వ పేజీ తరువాయి)

నేలపాడు వద్ద ఓవైపు ఎన్-12, ఎన్-13ల మధ్య ఇంకోవైపు ఈ-7, ఈ-8ల మధ్య రహదారుల వెంబడి 14.46 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టింది. మొత్తం 1200 ఫ్లాట్లు.. 12 టవర్లను 2బీ+జీ+18 అంతస్తులుగా నిర్మించాలని ప్రతిపాదించింది. అప్పట్లో ప్రాజెక్టు మొత్తం ఖర్చును రూ.714 కోట్లుగా అంచనా వేసి నిర్మాణ పనులను షాపూజీ పల్లోంజీ సంస్థకు అప్పగించింది. చదరపు గజం ధరను రూ.4049 వంతున నిర్ణయిస్తూ ప్రాజెక్టును ప్రకటించగా.. జనం ఎగబడి ఇంచుమించుగా 1185 మంది ఫ్లాట్లను బుక్ చేసుకున్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అటకెక్కించింది. దీంతో ప్రాజెక్టు పనులు కేవలం పైల్స్ టెస్టింగ్ వరకు మాత్రమే పరిమితమయ్యాయి. దీంతో ఫ్లాట్లు బుక్ చేసుకున్న వారంతా గగ్గోలు పెట్టారు. వీరిలో సుమారు వంద మంది కావాలని కోరడంతో రూ.25 కోట్ల మేర అడ్వాన్స్‌లను ఇచ్చేశారు. బుక్ కాని 15 ఫ్లాట్లతో పాటు వంద మంది నగదు వెనక్కి తీసుకోవడంతో ప్రస్తుతం 115కు పైగా ఫ్లాట్లు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికే బుక్ అయిన ఫ్లాట్లను మినహాయించి ఖాళీగా ఉన్న ఫ్లాట్‌లను కొత్తగా బుక్ చేసుకునేవారికి మాత్రం పెరిగిన నిర్మాణ వ్యయాన్ని బట్టి ఎస్ఎఫ్‌టీ రేట్లను నిర్ణయిస్తారు. పాతవారి నుంచి మాత్రం అదనంగా పైసా కూడా వసూలు చేయరు. ప్రస్తుతం ప్రాజెక్టు స్థలంలో నెలరోజులుగా నీటి తోడివేత పనులు చేపట్టి జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నారు. ప్రాజెక్టు పనులు రెండేళ్లకు పైబడి సాగనుండడంతో ఆ ప్రాంగణంలోనే కార్మికులు నివాసం ఉండేందుకు వీలుగా


నేలపాడు వద్ద ఏడీసీఎల్ నిర్మిస్తున్న హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు తాలూకు గ్రౌండు

తాత్కాలిక షెడ్లను కూడా నిర్మించారు. భవన నిర్మాణపనులను ఆరంభించేందుకు ముందస్తు ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తున్నారు.

రెండేళ్లలో పనులు పూర్తి..

ఈ ప్రాజెక్టులో 1225, 2750 చదరపు అడుగుల విస్తీర్ణం కల ఫ్లాట్లు ఉన్నాయి. ఇందులో 144 ఫ్లాట్లు డబుల్ బెడ్ రూమ్‌వి కాగా, 1036 ట్రిబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లుగా ఉంటాయి. మొత్తం విస్తీర్ణంలో అత్యధిక భాగం ల్యాండ్‌స్కేపింగ్, అంతర్గత రోడ్ల కోసమే వినియోగించేలా ప్రణాళికను రూపొందించారు. ఒక్కో అంతస్తులో రెండేసి పార్కింగ్ ఫ్లోర్లకు స్థానం కల్పించి మొత్తం 12 టవర్లలో కలిపి 1631 కార్లు, 1200 బైకులను పార్కింగ్ చేసుకునేలా వెసులుబాటును కల్పిస్తున్నారు. ఇవి గాక మరో రెండు ఎమినిటీస్ బ్లాకులను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే రెండేళ్లలోగా ప్రాజెక్టును పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థకు ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది.

అవినీతి చేయకపోతే డబ్బులు వెనక్కి ఎందుకు ఇస్తున్నారు

మాజీ మంత్రి రజనికి ప్రత్తిపాటి సూటి ప్రశ్న



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట,మార్చి24 (ఆంధ్రజ్యోతి): ఏ తప్పుచేయకపోతే, అవినీతికి పాల్పడకపోతే దోచిన డబ్బులు ఎందుకు వెనక్కు ఇస్తున్నారో, క్రషర్ వారితో రాయబారాలు ఎందుకు చేశారో చెప్పాలని స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మాజీ మంత్రి రజనీని ఉద్దేశించి అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో పుల్లారావు మాట్లాడు తూ తనవద్దకే మనుషుల్ని రాయబారానికి పంపారని స్వయంగా ఎంపీ కృష్ణదేవరాయులు చెప్పలేదా, చేసిన తప్పులకు ఎంతటివారైనా మూల్యం చెల్లించుకోవాల్సిందేనని, చట్టప్రకారం శిక్ష అనుభవించాల్సిందేనని చెప్పారు. పసుమర్రు జగనన్న కాలనీ భూసేకరణ విషయంలో డబ్బులు గుంజి కేసుల భయంతో తిరిగి రైతులకు వెనక్కు ఇచ్చిన విషయం అందరికీ తెలిసిందే అని అన్నారు. అవినీతి మంత్రిగా ముద్ర వేయించుకుని, ఇప్పుడు తప్పుచేయలేదంటే ప్రజలు నమ్ముతారా అని ప్రశ్నించారు. చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడానికి నిజాయితీపరుడైన ఎంపీపై కూడా నిందలు వేసే స్థాయికి వచ్చారన్నారు. ఆమె అవినీతిపై సొంతపార్టీవారే హైకోర్టుకు వెళ్ళిన విషయం అందరికీ తెలిసినదేనన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి సోమేపల్లి సాంబయ్య 6 సార్లు, తాను 6 సార్లు పోటీచేశామని, ఎవరైనా, ఎప్పుడైనా సరే, సొంతపార్టీ వారు మాపై హైకోర్టును ఆశ్రయించారా అని ప్రత్తిపాటి ప్రశ్నించారు. అవినీతి ఆరోపణలు రాబట్టే సొంతపార్టీ వారే గత ఎన్నికల్లో గుంటూరుకు పంపించారని అన్నారు. ఆమె చేసిన తప్పులు కడుక్కోవడానికి ఆమె జీవితం సరిపోదని, ఆ తప్పులపై సొంతపార్టీవారే తేల్చుకోవడానికి క్యూలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో సోషల్ మీడియా ముసుగులో అసభ్య ప్రచారానికి తెరలేపి, విష ప్రచార సంస్కృతిని తీసుకొచ్చి, చేసిన దుష్ప్రచారాన్ని ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదని అన్నారు. చేసిన అవినీతిని రూపాయితో సహా కక్కించేవరకు కూటమి ప్రభుత్వం వదిలిపెట్టదని చెప్పారు. ఐ-టీడీపీ కోఆర్డినేటర్ పిల్లికోటి వ్యవహారంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చంద్రబాబు ఏనాడో చెప్పారని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

ఎన్ఎస్‌పీ డిప్యూటీ సీఈగా రాధాకృష్ణ బాధ్యతల స్వీకారం



గుంటూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్టు డిప్యూటీ చీఫ్ ఇంజనీర్‌గా వీ రాధాకృష్ణ బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఉదయం గుంటూరులోని ఎన్ఎస్‌పీ చీఫ్ ఇంజనీర్ కార్యాలయానికి వచ్చిన ఆయన డిప్యూటీ సీఈగా చార్జ్ తీసుకొన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతపురం జిల్లాకు చెందిన రాధాకృష్ణ 1992వ సంవత్సరంలో అసిస్టెంట్ ఇంజనీర్ హోదాలో హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టులో చేరారు. అక్కడ దీర్ఘకాలం విధులు నిర్వహించిన తర్వాత అన్నమయ్య, కడప వెలిగల్లు ప్రాజెక్టుల్లో డీఈఈగా విధులు నిర్వహించారు. ఆ తర్వాత కర్నూలు ఎస్ఆర్‌బీసీలో విధులు నిర్వహించారు. ఇటీవలే ఆయన్ని ఈఈ క్యాడర్‌లో ఎన్ఎస్‌పీ సీఈగా ప్రభుత్వం బదిలీ చేయడంతో సోమవారం ఇక్కడికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ తమ పరిధిలో రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

నిదానంపాటి అమ్మవారి జాతర ఆదాయం రూ. 38,62,340

దుర్గి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పులలో వేంచేసి యున్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి వివిధ రూపేణా సమర్పించిన కానుకలను సోమవారం ఆలయంలో లెక్కించగా రూ. 38,62,340లు ఆదాయం సమకూరింది. వివిధ రకాల సేవల ద్వారా రూ. 11,34,439, హుండీ ద్వారా


అమ్మవారి జాతర ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

రూ. 27,27,901లు ఆదాయం సమకూరినట్లు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఈవో సైదమ్మబాయి, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు తెలిపారు. గతేడాది కన్నా ఈ ఏడాది రూ. 9,05,532ల ఆదాయం ఎక్కువగా సమకూరిందన్నారు.

వివాహిత హత్య

వివాహేతర సంబంధమే కారణమా?

పిడుగురాళ్ళ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత హత్య జరిగిన సంఘటన పిడుగురాళ్ల పట్టణంలో సోమవారం తెల్లవారుజామున వెలుగుచూసింది. ఇందుకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు... జానపాడు గ్రామానికి చెందిన తాటి కొండలు, ఆదిలక్ష్మి దంపతులు పిడుగురాళ్ల పట్టణంలో సున్నపు బట్టీలలో కార్మికులుగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో బట్టీలో మేస్త్రీగా పని చేసే ఏడుకొండలుతో ఆదిలక్ష్మికి పరిచయం ఏర్పడింది. దీంతో భర్త కొండలను వదిలేసి ఏడుకొండలతో ఐదు సంవత్సరాలుగా తనకు ఉన్న ఇద్దరు పిల్లలలో పిడుగురాళ్ల పట్టణంలోని మారుతీ నగర్‌లో నివాసం ఉంటుంది. సోమవారం తెల్లవారుజామున ఏడుకొండలు బట్టీ పనికి వెళ్లగా.. రోజు మాదిరిగానే పిల్లలు అమ్మమ్మ పార్వతమ్మ వద్ద నిద్రించి తిరిగి ఉదయాన్నే ఇంటికి రాగానే రక్తం కనిపించటం, ఇంట్లో అమ్మ కనిపించకపోవటంతో అమ్మమ్మకు, బంధువులకు, స్థానికులకు సమాచారం అందజేశారు. బంధువులు, స్థానికులు విషయం వెంటనే పోలీసులకు తెలియజేయటంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ మొదలు పెట్టారు. అయితే దారిపొడవునా రక్తపు మరకలు ఉండటంతో ఆ రక్తపు మరకలను ఫాలో అవుతూ పోలీసులు వెళ్లారు. మారుతీ నగర్‌కు దూరంగా నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న క్వారీ గుంత వద్ద రక్తపు మరకలు, ఆదిలక్ష్మికి సంబంధించిన తాళిబొట్టు కనిపించింది. వెంటనే పోలీసులు క్వారీ గుంతలో వెతకగా ఆదిలక్ష్మి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వెంటనే ఏడుకొండలను విచారించగా అతను తడబడుతుండటంతో పోలీసులు ఏడుకొండలను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆదిలక్ష్మి (ఫైల్)

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ కే శ్రీనివాసరావు

మారుతీనగర్ ప్రాంతంలో సోమవారం ఉదయం జరిగిన ఆదిలక్ష్మి హత్య ప్రదేశాన్ని సోమవారం రాత్రి పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సందర్శించారు. సమీపంలో నివసిస్తున్న వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కడుపు నొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

యడ్లపాడు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కడుపు నొప్పి తాళలేక వివాహిత ఆత్మ హత్యకు పాల్పడిన ఘటన యడ్లపాడు మండలం బోయపాలెంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన భార్గవి(25)కి యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామానికి చెందిన వడ్డేపల్లి అశోక్‌తో ఏడేళ్ళ క్రితం వివాహం జరిగింది. అశోక్ ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుండగా భార్గవి కూలి పనులకు వెళుతూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటుంది. వీరికి ఇద్దరు సంతానం. అయితే భార్గవి గత కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. విషయం తల్లి దుర్గకు తెలుపగా ఉప్పలపాడు ఆర్ఎంపీ వైద్యునితో వైద్యం చేయించి భర్తవద్దకు పంపించింది. అయితే కడుపు నొప్పి తగ్గకపోవడంతో తల్లికి ఫోన్‌చేసి నొప్పి భరించలేకున్నాను చనిపోవాలని ఉందంటూ పలు మార్లు చెప్పింది. ఆదివారం సాయంత్రం మరోసారి తీవ్రంగా నొప్పి రావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గ్రామానికి చేరుకుని కుమార్తెను చూసి భోరున విలపించారు. మృతురాలి తల్లి దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

యడ్లపాడు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన యడ్లపాడు మండలం తిమ్మాపురం పరిధిలో 16వ నంబరు జాతీయరహదారి కొత్త బైపాస్ మార్గంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన ఓ కుటుంబం ఏపీ 39 ఎస్‌డబ్ల్యూ 1414 నంబరు గల స్కార్పియో వాహనంలో ఆదివారం సాయంత్రం ఒంగోలు వైపు బయలు దేరారు. సుమారు రాత్రి 8.30గంటల సమయంలో తిమ్మాపురం వద్ద కొత్త బైపాస్ మార్గంలోని బ్రిడ్జిపైకి వీరి కారు చేరుకుంది. ఆ సమయంలో గుంటూరు నుంచి కనిగిరికి గృహోపకరణాలు తీసుకుని వెళుతున్న ఏపీ 39 డబ్ల్యూసీ 8067 నంబరు గల టాటా ఏస్ మినీ ట్రాన్స్‌పోర్ట్ వాహనం వేగంగా వస్తూ అదుపు తప్పి స్కార్పియోను వెనుక నుంచి ఢీకొట్టింది. దీనితో స్కార్పియో వాహన యజమానికి మినీ ట్రాన్స్‌పోర్టు వాహనం డ్రైవర్ బత్తుల వెంగయ్య(30)ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వాగ్వాదం మధ్యలో ఒంగోలు సమీపంలోని స్వగ్రామమైన ఎస్ గూడెపల్లెలోని తల్లిదండ్రులకు ఫోన్‌చేసి ప్రమాదం గురించి సమాచారం ఇచ్చాడు. అనంతరం నడ్డిరోడ్డుపై నిలిపి ఉంచిన వాహనం వద్దకు పరుగు తీశాడు. ఆ సమయంలో అతి వేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు వెంగయ్యను ఢీకొట్టింది. వెంగయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనపై తల్లి వీరమ్మ సోమవారం యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. మృతదేహానికి చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు వెల్లడించారు.

బైకును టాటా మ్యాక్సీ ఢీకొని ఒకరి మృతి


అశోక్‌రెడ్డి (ఫైల్‌ఫోటో)

వెల్దుర్తి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బైకును టాటా మ్యాక్సీ ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని శిరిగిరిపాడులో చోటుచేసుకుంది. శిరిగిరిపాడు గ్రామానికి చెందిన ఈదర అశోక్‌రెడ్డి (29), బోయ వెంకటరెడ్డిలు సోమవారం ద్విచక్ర వాహనంపై పొలం నుంచి ఇంటికి వస్తున్నారు. గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు రాగానే వెనుకగా వచ్చిన టాటామ్యాక్సీ వాహనం బైకును ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలపాలైన అశోక్‌రెడ్డిని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. వెంకటరెడ్డి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంచికల్లు రిజర్వాయర్‌లో మృతదేహం లభ్యం

రహదారి పనులకెళ్లి శవమై తేలాడు...!


తురకా కోటేశ్వరరావు(ఫైల్)

రెంటచింతల,మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కూలీ పనులకెళ్లి సాగర్ కాలువలో జారిపడిన యువకుడు మృతదేహం సోమవారం మంచికల్లు రిజర్వాయర్‌లో లభ్యమైంది. సేకరించిన వివరాలిలా వున్నాయి. మండలంలోని పాలువాయి గ్రామానికి చెందిన తురకా శ్రీను,నాగలక్ష్మిల ఏకైక కుమారుడు కోటేశ్వరరావు గురజాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసి శనివారం జాతీయ రహదారి పనులకెళ్లాడు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన కూలీలతో కలిసి పనిచేసిన తరువాత ట్యాంకర్‌లో నీటిని నింపే క్రమంలో కాలుజారి బొంబాయి బ్రిడ్జి కుడి కాలువలో పడిపోయాడు. సోమవారం బుగ్గవాగు రిజర్వాయర్‌లో శవమై తేలాడు.

కొలనుకొండ హతురాలు సజ్జా తిరుపతమ్మగా గుర్తింపు


సజ్జా తిరుపతమ్మ (ఫైల్ ఫోటో)

తాడేపల్లి (కొలనుకొండ), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం కొలనుకొండ వద్ద హైవేకు సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో హత్యకు గురై విగతజీవిగా పడివున్న మహిళను పామర్రుకు చెందిన సజ్జా తిరుపతమ్మ (35) గా పోలీసులు గుర్తించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలని భర్త మృతి చెందడంతో కుటుంబ పోషణ భారమై క్యాటరింగ్ పనులకు వెళుతుందని సీఐ కల్యాణ్‌రాజు తెలిపారు. ఆదివారం ఉదయం విజయవాడలో క్యాటరింగ్ పనులకు వెళుతున్నానని చెప్పి తిరుపతమ్మ ఇంటి నుంచి వచ్చిందని హతురాలి కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. అనంతరం హత్యకు గురైన మహిళ విషయం వెలుగులోకి రావడంతో మృతురాలిని గుర్తించామని చెప్పారు. విషయం తెలిసిన కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారని తెలిపారు. కాగా ఈ విషయమై క్లూస్ టీమ్ సోమవారం సంఘటనా స్థలానికి చేరుకుని పలు వివరాలు సేకరించింది. ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని సీఐ తెలిపారు. కాగా ఈ హత్యకు సంబంధించి పలువురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 520.60 అడుగులు ఉంది. ఇది 150.37 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6041 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6870 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 14,711 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	109, 117, 128
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

1,05,783 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,18,783 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,05,783 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 54,366 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13000
నంబరు. 5	10000	13100
273	--	--
341	10000	14000
4884	--	--
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13200

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	10000	12000
బ్యాడిగి 355	10000	12700
సింజెంటా బ్యాడిగి 5531	--	--
దేవనూరు డీలక్స్	10200	12500
ఆర్మూరు	10000	11600
తాలుకాయలు	5000	7200

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

పారిశుధ్య మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారించాం

● నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



పాత గుంటూరులో మహిళలతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ పరిధి లో పారిశుధ్య మెరుగు కోసం ప్రత్యేక దృష్టి సారించామని, అధికారులు, కార్యదర్శులు పని తీరు మార్చుకొని ఎక్కడా ఫిర్యాదులు లేనివిధంగా కృషి చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ యాదవుల బజార్, ఆనందపేట, అలీ నగర్, సూర్య నగర్, కబాడీగూడెం, ఎల్ఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో కార్పొ రేటర్లు అబిద్‌బాషా, మీరావలి, డీఈఈ నాగభూషణం, ఎస్ఎస్ రాం బాబు, టీపీఎస్ లక్ష్మణస్వామి, ఏఈ రవికిరణ్ పాల్గొన్నా రు.

● గుంటూరు నగరంలోని అన్నక్యాంటీన్ల పరిసరాల్లో మొక్కలు నాటాలని కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నల్లచెరువు మెయిన్‌రోడ్‌లోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించి, ప్రజలతో మాట్లాడి, సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

● గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్‌యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజ లు ఇస్తున్న అర్జీల్లో మౌలిక వసతులకు సంబంధించి తక్షణం శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 18 ఫిర్యాదులు తీసుకున్నారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 43 ఫిర్యాదులు అందాయని వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటి కమిషనర్ డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీపీ రాంబాబు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

27న జీఎంసీ టెండర్లు, బహిరంగ వేలం

గుంటూరు నగరపాలక సంస్థ మార్కెట్లు, సైకిల్ స్టాండ్లు, టాయ్‌లెట్స్‌ల టెండర్, బహిరంగ వేలం ఈ నెల 27న జీఎంసీ ట్రావెలర్స్ బంగ్లాలో నిర్వహిస్తామని, ఆసక్తి కల్గినవారు పాల్గొనవచ్చని కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల్గిన వారు రూ.100 చలానా చెల్లించి, జీఎంసీ ప్రధాన కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో ఏ-2 గుమస్తా నుంచి టెండర్ షెడ్యూల్ పొందవచ్చన్నారు. వివరాలకు డిప్యూటీ కమిషనర్ (9849908364)ను సంప్రదించవచ్చన్నారు.

హౌస్ హోల్డ్ జాబితాలో వివరాలు నమోదు చేసుకోవాలి

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రభుత్వం నుంచి పౌరసేవలతో పాటు గా సంక్షేమ పథకాలు, ఇతర ప్రయోజనాలు పొందేందుకు వార్డు సచివాలయాల కుటుంబాల (హౌస్ హోల్డ్) జాబితా లేదా ఆర్టీజీఎస్ డేటా బేస్‌లో తమ వివరాలు తప్పనిసరిగా నమోదు చేసుకొని ఉండాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు జీఎంసీ ప్రత్యేక కౌన్సిల్ సమావేశం

గుంటూరు కార్పొరేషన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ ప్రత్యేక కౌన్సిల్ సమావేశం మంగళవారం జరగనుంది. ఈ సమావేశానికి నగరపాలక సంస్థ ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల అధ్యక్షత వహించనున్నారు. ఈనెల 15న మేయర్ పదవికి మనోహర్ నాయుడు రాజీనామా చేయగా, నేటి సమావేశంలో ఆ రాజీనామాను ఆమో దించి ప్రభుత్వానికి పంపనున్నారు. కేవలం రాజీనామా ఆమోదం కోసమే ఈ ప్రత్యేక కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.

బీఎన్ఐ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవం

గుంటూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బీఎన్ఐ(బిజినెస్ నెట్‌వర్కింగ్) గుంటూరు ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని స్థానిక రింగు రోడ్డులో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు నుంచి వివిధ రంగాలకు చెందిన 60 మందికి పైగా మహిళా పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలను అభినందించి సంస్థ అవార్డులు ప్రదానం చేసింది. ముఖ్యఅతిథులుగా బెంగళూరుకు చెందిన అన్నె కుమార్, చాందిని చందన, బీఎన్ఐ గుంటూరు ఈడి శేఖర్‌బాబు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభని ప్రదర్శిస్తూ దూసుకెళుతున్నార ని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని బీఎన్ఐ ప్రతినిధులు డాక్టర్ అనూష, పోట్రు వీరయ్య చౌదరి, క్రాంతిలు పర్యవేక్షించగా సురక్ష కన్సల్టెన్సీ ప్రధాన భాగస్వామిగా నిలిచింది.



ప్రపంచ మహిళ దినోత్సవంలో పాల్గొన్న మహిళ పారిశ్రామికవేత్తలు

ఎస్సీ వర్గీకరణలో నెలకొన్న అపోహలను తొలగించాలి

● మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మయ్య

గుంటూరు(తూర్పు), మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్సీ వర్గీకరణలో నెలకొన్న అపోహలను తొలగించాలని మాది గ రిజర్వేషన్ పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మ య్య మాదిగ అన్నారు. స్థానిక ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న అంబేద్కర్ భవన్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీవ్ రంజన్‌మిశ్రా నివేదికకు ఆమోదం తెలిపిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ మాదిరిగానే వర్గీకరణపై ఆర్డినెన్స్ కాకుండా చట్టం చేయాలన్నారు. రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకొని ముందుకు వెళ్తేనే మాదిగలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. మంద కృష్ణ మాదిగ వర్గీకరణ జిల్లా యూనిట్‌గా చేసిన ఫర్వాలేదనడం సరికాదని, తన వైఖరి మార్చుకోవాలని సూచించారు. సమావేశంలో సంఘ నాయకులు కొమరాల శ్రీనివాస్, ఏటూకూరి విజయ్ కుమార్, ఆనంద్ మాదిగ, నాగరాజు మాదిగ, ప్రసన్నకుమార్, శ్రీనివాస్, వెంకట్రావు, ఇజ్రా యేల్, ఓలేటి భూషణం తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో దళిత యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి

గుంటూరు(తూర్పు), మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఏపీలో ఎస్సీలకు ప్రత్యేకంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఒక యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ఇద్వా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజ సుందరం బాబు అన్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సచివాలయంలో సోమవారం సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామికి ఆయన వినతిపత్రం అందజేశారు. అంతేగాక గుంటూరులోని అంబేద్కర్ భవనం నిర్మాణం పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయా లని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అంబేద్కర్ భవన విషయం తన దృష్టికి తెచ్చారని, త్వరలోనే అంచనాలు తెప్పించుకుని భవన నిర్మాణం పూర్తి చేద్దామని మంత్రి హామీ ఇచ్చినట్టు గోళ్లమూడి తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో దళిత సంఘ నాయకులు నల్లపు నీలాంబరం, చిన్నం డేవిడ్ విలి యమ్స్ రవీంద్ర, రత్నం, పమిడిపల్లి లక్ష్మి, లలిత, ప్రియాంక అమృత్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిల చెల్లింపుపై హర్షం : ఎన్‌టీఏ

గుంటూరు(విద్య), మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వం వచ్చిన తొమ్మిది నెలల్లోనే రూ.11వేల కోట్లు చెల్లించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు, బొనిగల హైమారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ జీఎల్, పీఎఫ్ లోన్లు, విశ్రాంత ఉద్యోగుల బకాయిలు రూ.6200 కోట్లు విడుదల చేశారని హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని రకాల బకాయిలు క్రమంగా చెల్లిస్తున్నారని ఇందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి : కలెక్టర్



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన జేసీ భార్గవ్‌తేజ తదితరులు

గుంటూరు(తూర్పు), మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అందిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 231 అర్జీలు వచ్చాయి. జేసీ భార్గవ్‌తేజ, డీఆర్వో ఖాజావలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎం గంగరాజు, ఆర్డీవో శ్రీనివాసరావుతో కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖల పరిధిలోని 18అర్జీలు గడువు ముగిసి బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లే అవకాశం ఉందని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. జేసీ భార్గవతేజ మాట్లాడుతూ కోర్టు కేసులను సమీక్షిస్తూ గౌరవ కోర్టులకు ఎప్పటికప్పుడు కౌంటర్లు దాఖలు పరచాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీపీవో నాగసాయికుమార్, ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ విజయ్‌ప్రకాష్ పాల్గొన్నారు.

● శంకర్‌విలాస్ వంతెన విస్తరణలో ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న పునీత ఆగ్నేసమ్మ చర్చిని మినహాయించాలని పాస్టర్ చిన్నయ్య కోరారు. ఈ మేర కు కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందించారు. హృదయరాజు, బాలశౌరి, మరియదాసు, మెర్సీ కమల, లీలాకుమారి తదితరులు ఉన్నారు.

● ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఆరోగ్యమిత్ర కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ సభ్యులు జాకీర్ హుస్సేన్, శ్రీను, శివకుమారి తదితరులు ఉన్నారు.

● జగనన్న ఇంటి పథకంలో స్థలం వచ్చిందని చెప్పి పట్టా ఇచ్చారని కాకపోతే స్థలం కేటాయించలేదని స్థానిక నల్లచెరువు, సుగాలికాలనీకి చెందిన స్థానికులు వాపోయారు. స్థలాలను కేటాయించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం వట్టిచెరుకూరు మండలం, అనంతరపాడు వద్ద మీకు స్థలాలు ఇస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. వాటి కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు.

● మెప్మా ఆధ్వర్యంలో సాయుధ దళాల పతాక దినోత్సవం 2024 నిధికి సేకరించిన విరాళం రూ. 2,05,197 చెక్కును సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్‌తేజలకు మెప్మా పీడీ విజయ లక్ష్మి అందజేశారు. ఈ చెక్కును జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్ గుణ శీలాకు కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి అధిక మొత్తంలో విరాళాలుసేకరించిన మెప్మా పీడీ విజయలక్ష్మిని కలెక్టర్, జేసీ సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా డీఆర్వో ఖాజా వలీ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత

కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా రోడ్డు రవాణా సంస్థలో విధులు నిర్వహిస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులు 13 మందికి గ్రామ, వార్డు సచివాలయాల్లో, 9 మందికి ప్రిజన్ శాఖలో, నలుగురికి జిల్లా పంచాయతీ శాఖలో జూనియర్ అసిస్టెంట్లుగా, ఐదుగురుకి బిల్ కలెక్టర్లుగా కారుణ్య నియామకపు పత్రాలను కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్‌తేజ అందజేశారు.

స్థల వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

● సీఐపై దాడి ● ఎస్పీ సహా భారీగా చేరుకున్న బలగాలు

గుంటూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురంలో సోమవారం రాత్రి ఉద్రిక్తత నెలకొంది. ఓ స్థల వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. స్థల వివాదంపై మంగళవారం చర్యలు తీసుకుంటామని అప్పటివరకు శాంతియుతంగా ఉండమని తహసీల్దార్ హెచ్చరించి వెళ్లారు. అయినప్పటికీ గేరా చిన్ని అనే వ్యక్తి ఆ స్థలంలో పోల్స్ వేస్తుండగా మరో వర్గం అడ్డుకునేందుకు వచ్చింది. దీంతో పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా కుదరలేదు. సమాచారం అందుకున్న ఫిరంగిపురం సీఐ రవీంద్రబాబు ఘటనా స్థలానికి వెళ్లి అదుపుచేసే ప్రయత్నం చేయగా ఆయనపై దాడి చేసి నెట్టేశారు. దీంతో ఆయన కాలువలో పడిపోయారు. శాంతించని ఆందోళనకారులు సీఐ వాహనంపై దాడి చేసి వాహనం ధ్వంసం చేశారు. ఒక్కసారిగా పరిస్థితి ఉద్రిక్తంగా మారటంతో ఎస్పీ సతీష్‌కుమార్‌తోపాటు జిల్లా కేంద్రం నుంచి పలువురు సీఐలు, అదనపు బలగాలతో ఫిరంగిపురం చేరుకున్నారు. అయితే ఒక వర్గం ఫిరంగిపురంలో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకోకు దిగింది. దీంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఎస్పీతోపాటు పోలీసు అధికారులు ఆందోళనకారులతో చర్చలు జరుపుతున్నారు.



ఫిరంగిపురంలో రోడ్డుపై ఘర్షణకు తలపడుతున్న ఇరువర్గాలు

వీధి వ్యాపారాలకు అనుమతి ఇవ్వాలి : సీపీఐ

గుంటూరు కార్పొరేషన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో వీధి వ్యాపారులకు వ్యాపార అనుమతులు ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ నగరంలో ఉన్న వీధి వ్యాపారులందర్నీ కమిషనర్ పులి శ్రీనివాసరావు తొలగించడంతో వారు తమ వీధి వ్యాపారాలు చేసుకునేందుకు వీల్లేకుండా పోయిందన్నారు. అనంతరం కమిషనర్‌ను కౌన్సిల్ సమావేశం హాలులో కలిశారు. స్పందించిన కమిషనర్ ఆ ప్రాంత చిరు వ్యాపారుల వివరాలు ఇవ్వాలని అనంతరం ఐడీ కార్డులు ఇచ్చి వెన్డింగ్ జోన్లు ఏర్పాటు చేస్తామని కానీ ఒక్క బండి మాత్రమే పెట్టుకోవాలని తెలిపారని అన్నారు.

టిడ్కో గృహ నివాసుల సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం

గుంటూరు కార్పొరేషన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో పేదలు నివసిస్తున్న కాలనీల్లో మంచినీరు, మురుగు కాలువలు, సిమెంట్ రోడ్లు వంటి మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.ముత్యాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ సీపీఎం ఆధ్వర్యంలో నగరంలో 'ప్రజా చైతన్య యాత్రలు' నిర్వహించి ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు గుర్తించామన్నారు. ధర్నా అనంతరం కమిషనర్ పులి శ్రీనివాసులుకు ప్రజాసమస్యల పరిష్కారవేదికలో వినతిపత్రాలు అందజేశారు. సీపీఎం నగర నాయకులు ఆదినికల్సన్, షేక్ ఖాశీంవలి, టి.శ్రీనివాస రావు, జి.వెంకట్రావు, కళ్యాణి, టిడ్కో గృహాలు, వివిధ కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి

గుంటూరు సిటీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు 15 ఆర్థికసంఘం నిధులు వెంటనే విడుదల చేయాలని ఏపీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్‌లకు సర్పంచుల సంఘం రాష్ట్ర నేతలు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సర్పంచుల సంఘం నేతలు తాడేపల్లిలోని పంచాయతీరాజ్ ప్రధాన కార్యాలయంలో సోమవారం అదనపు కమిషనర్‌లు ఎం.సుధాకర్‌రావు, ఎం.శివప్రసాద్‌లను కలిసి వినతి పత్రం అందజేశారు. సర్పంచుల గౌరవ వేతనం, గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సందర్భంగా చర్చించారు. అదనపు కమిషనర్‌లను కలిసిన వారిలో ఆంధ్ర ప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కమిషనర్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు ఉన్నారు.

ఆధునికీకరించిన ఎస్‌పీఎం సెమినార్ హాల్

గుంటూరు మెడికల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాలలోని దాతల సాయంతో వివిధ వైద్య విభాగాలను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ ఆధునికీకరి స్తున్నారు. సామాజిక వ్యాధి నిరోధక (ఎస్‌పీఎం) విభాగంలో ఆధునికీకరించిన సెమినార్ హాల్‌ను సోమవారం ఎస్‌పీఎం విభాగాధిపతి డాక్టర్ సీతారామ ప్రారంభించారు. కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారీ, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. శ్రీ హాస్పిటల్స్‌కు చెందిన కార్డియాలజిస్ట్ డాక్టర్ బీవీ నారాయణ రెడ్డి, రీజెనరేటివ్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ ఏ విజయ్‌రాకేష్ ఈ సెమినార్ హాల్‌కు రెండు ఎయిర్‌కండీషన్డ్ మెషిన్లను విరాళంగా అందజేశారు. జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్ ఉమాజ్యోతి మాట్లాడుతూ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారీ నేతృత్వంలో వైద్య కళాశాల దినదినాభివృద్ధి సాధిస్తున్నట్లు కొనియాడారు. పెథాలజీ విభాగంలో కొత్తగా అందుబాట్లోకి వచ్చిన ఆధునిక ఇమ్యునో ఫ్లోరోసెన్స్ మైక్రోస్కోప్‌ను సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారీ ప్రారంభించారు. నగరానికి చెందిన బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌం డేషన్ విరాళంగా ఈ మైక్రోస్కోప్‌ను అందజేసింది.

ఇళ్ళ మధ్య మద్యం దుకాణంతో మనశ్శాంతి కరువు

● ఎస్పీని ఆశ్రయించిన బాధిత మహిళలు



ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన మహిళలు

గుంటూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నల్ల చెరువు 10వ లైన్ మెయిన్ రోడ్డుపై ఇళ్ళ మధ్య ఉన్న మద్యం దుకాణం కారణంగా సమీప ప్రాంతాల్లోని ప్రజలకు మనశ్శాంతి కరువైందని స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఈ విషయమై గతంలో లాలాపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు వచ్చిన సమయంలో అక్కడి నుంచి పారిపోతు న్నారని ఆ తర్వాత మళ్లీ అక్కడే చేరుతున్నారన్నారు. ఎవరైనా తమ ఇంటి ముందు మద్యం తాగొద్దు అని చెబితే వారిని అసభ్యకరంగా దూషిస్తున్నారని ఆయా మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

నా కుమారుడిని చంపిన కేసులో ఇంతవరకు చర్యలు తీసుకోలేదు

ద్విచక్ర వాహనంపై వెళ్తున్న నా కుమారుడిని మరో ద్విచక్ర వాహనంపై ఇచ్చిన ఇద్దరు కాళ్లతో తన్ని చేతులతో నెట్టి రోడ్డు ప్రమాద రూపంలో చంపిన కేసులో రోజులు గడు స్తున్నా ఇంతవరకు పట్టాభిపురం పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని దివంగత సీఐ బ్రహ్మయ్య సతీమణి వైరత్నకుమారి సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయిం చారు. ఆమె ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలిసి తన కుమారుడు మృతిపై ఫిర్యాదు చేశారు.

హాస్టల్ నుంచి కుమారుడు అదృశ్యమై నెల రోజులు గడుస్తున్నా..

తన కుమారుడు వెండిదండి ఓం సాయిరెడ్డి (15) పట్టాభిపురం మెయిన్‌రోడ్డులోని కృష్ణనగర్ 4వ లైనులో గల ఓ కార్పొరేట్ స్కూల్ హాస్టల్లో ఉంటూ పదో తరగతి చదు వుతూ హాస్టల్ నుంచి అదృశ్యమై నెల రోజులు గడుస్తున్నా కేసులో ఇంతవరకు ఎటువంటి పురోగతి లేదని విద్యార్థి తండ్రి శివశంకర్‌రెడ్డి సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయిం చారు.

స్కూటీ డిక్కీలో నుంచి 25 సవర్ల బంగారం అపహరణ

రైల్వేస్టేషన్ వద్ద తన స్కూటీ డిక్కీలో ఉన్న సంచిలో 25 సవర్ల బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని, ఈ ఘటన జరిగి ఏడాది గడుస్తున్నా కేసులో ఎటువంటి పురోగతి లేదని గోరంట్లకు చెందిన బాధితురాలు పి.కోటిరత్నం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. తాను గోరంట్లలో మిషన్ కుట్టుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నానని తెలిపారు. తన బంగారు ఆభరణాలు రికవరీ చేయకుంటే ఆత్మహత్య తప్ప మరో మార్గం లేదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికీ అనేకసార్లు ఎస్పీ కార్యాలయం చుట్టూ తిరిగానని న్యాయం జరగలేదని ఆమె తెలిపారు.

చోరీ జరిగి రెండు నెలలైనా పురోగతి లేదు...

తమ ఇంట్లో చోరీ జరిగి రెండు నెలలైనా ఇంతవరకు ఎటువంటి పురోగతి లేదని అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివనాగరాజు కాలనీ 10వ లైన్‌కి చెందిన పెరికల లక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఆమె ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించింది. తాము పేద కుటుంబానికి చెందినవారమని, పోలీసులు పూర్తిస్థాయిలో తమకు న్యాయం చేసి తమ సొత్తు రికవరీ చేయాలని బాధితురాలు పోలీసు అధికారుల ను వేడుకున్నారు.

షేర్ మార్కెట్ పేరుతో కోట్లాది రూపాయల మోసం

షేర్ మార్కెట్లో పెట్టుబడి పెడితే 6.5 శాతం డివిడెంట్ చెల్లించడమే కాకుండా ఆ మొత్తానికి మీ పేరుతో డిమ్యాట్ ఖాతా ద్వారా ట్రేడ్ చేస్తానని పెద్దఎత్తున లాభాలు వస్తాయని ఆశ చూపించి బ్రాడీపేట 2/18కు చెందిన ఉప్పులూరి భీమసేన రాఘవేంద్ర ఆయన భార్య లక్ష్మీశారదలు ఎంతో మంది నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి మోసం చేశారంటూ హైదరాబాదులోని బాచుపల్లికి చెందిన ఆర్‌వీ రాఘవ సత్యకుమార్ సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. గతంలో తాను అమరావతి రోడ్డులోని అన్నపూర్ణనగర్‌లో ఉన్నట్లు తెలిపారు. 2023 నవంబర్‌లో భీమసేన రాఘవేంద్ర హైదరాబాదులోని తన ఇంటికి వచ్చి తనకు షేర్ మార్కెట్ పేరుతో మాయమాటలు చెప్పి ఆరున్నర లక్షలు పెట్టుబడిగా పెట్టించాడన్నారు. తనలాగే అనేక మంది నుంచి లక్షల రూపాయలు పెట్టుబడి రూపంలో సుమారు 5 కోట్లకు పైగా వసూలు చేసి కొద్ది నెలల నుంచి కనిపించకుండా పోయాడన్నారు. భార్యాభర్తలపై కఠిన చర్యలు తీసు కొని తమకు న్యాయం చేయాలని రాఘవ సత్యకుమార్ ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో వాపోయారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

గుంటూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక వెస్ట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మెడికల్ క్లబ్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కొలకలూరి బాలశౌరి(55) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదంలో గాయపడిన బాలశౌరిని ఆదివారం రాత్రి జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బాలశౌరి సోమవారం మృతి చెందాడు. మెడికల్ క్లబ్ వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో బాలశౌరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన యువకుడు ద్విచక్రవాహనాన్ని అక్కడే వదిలి పారిపోయాడు. నిందితుడుని మైనర్‌గా అనుమానిస్తున్నారు. వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభం ఎక్కి యువకుడి ఆత్మహత్యాయత్నం

స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని కోబాల్డ్‌పేట ఒకటవ లైనులో సోమవారం ఓ యువకుడు కరెంటు స్తంభం ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బొల్లాపల్లి మండలం గండిగనుముల గ్రామానికి చెందిన బర్మానాయక్ (25) తల్లిదండ్రులు గతంలోనే చనిపోయారు. ప్రస్తుతం బ్రాడీపేట 6/14లోని డీలక్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. ముగ్గురు అక్కలు గుంటూరులో ఉంటూ పట్టించుకోనందున మనస్థాపం చెందాడు. సోమవారం రాత్రి కరెంటు స్తంభం ఎక్కగా పోలీసులు అతన్ని కిందకు దించారు. పోలీసులు అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్, పక్కన మేయర్ సజీల

గుంటూరు తూర్పులో అభివృద్ధి వికాసం : ఎమ్మెల్యే నసీర్

● రూ.కోటి 79 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గుంటూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రతి ప్రాంతంలో సమగ్రప్రగతి సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని శారదాకాలనీ 2వ లైన్ నుంచి 20వ లైన్ వరకు సీసీ రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధికి రూ.కోటి 79లక్షలతో చేపట్టిన పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో శారదాకాలనీలో ఎటువైపు చూసిన గుంతలు, కదలని మురుగు కాలవలు, చెత్తాచెదారం కనిపించేవని, కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని ప్రాంతాలను సమంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో నివేదికలు సిద్ధం చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మేయర్ సజీల, మహంకాళి నరసింహారావు, బాజీ, ఆనంద్, కిషోర్, గౌస్, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఈద్గాలను పరిశీలించిన ఎమ్మెల్యే నసీర్

రంజాన్ సందర్భంగా ఈద్గాలలో సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ సూచించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లోని ఈద్గాల ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ముస్లింలతో మాట్లాడారు. అనం తరం ఈద్గాల పరిసరాలను పరిశీలించి మంచినీటి సదుపాయంతోపాటు ఇతర సౌకర్యాల పై దృష్టి సారించాలన్నారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఈ నెల 27న రాష్ట్ర వ్యాప్తంగా ఇఫ్తారు కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు.

మహిళా సాధికారతకు సఖి నివాస్‌ల తోడ్పాటు

● ఎమ్మెల్యే గళ్లా మాధవి



మహిళా ప్రాంగణంలో తనిఖీ చేస్తున్న గళ్లా మాధవి

గుంటూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మహిళా ప్రాంగణంలోని శిశు వికాసం, వనితా నివాస్, వన్ స్టాప్ సెంటర్, డొమెస్టిక్ వయిలెన్స్ సెంటర్, శిశు నివాస్, కాలేజ్ హోం, స్వధార్ హోమ్, వర్కింగ్ ఉమెన్ హాస్టల్, సఖీ నివాస్‌లు మహిళా సాధికారతకు ఎంతో తోడ్పాటునం దిస్తున్నాయని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. గుంటూరు మహి ళా ప్రాంగణాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ విభాగాలను పరిశీ లించి, నిర్వహణ గురించి వాకబు చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ భవనాలన్నీ పాతవికావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటన్నిటినీ పరిశీలించి, పునరుద్ధరణ కోసం ప్రయత్నిస్తామని చెప్పారు. ప్రాంగణంలో ప్రహరీ లేక పోవడం ఆందోళనకరమన్నారు. ప్రభుత్వం విడుదల చేసే నిధులను సద్వినియోగించుకొని అధికారులు అలాంటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

రూ.1.97 కోట్లతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

గుంటూరు 21, 28వ డివిజన్లలో రూ.1.97 కోట్ల అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మె ల్యే మాధవి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండ, వర్షాకా లాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. 21వ డివిజన్లో దాదాపు రూ.కోటి 26 లక్షలతో రెండు కల్వర్టులు నిర్మించబోతున్నామని, 28వ డివిజన్లో రూ.71లక్షలతో సీసీ రోడ్లు నిర్మించబోతున్నామని చెప్పారు.

వైసీపీ నేతలు నీతి బోధనలు హాస్యాస్పదం

విడదల రజిని విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి 'వైసీపీ లేకుండా చేయాలని కూట మి చూస్తున్నదని చెప్పడాన్ని ఎమ్మెల్యే గళ్లా మాధవి ఖండించారు. వైసీపీ లేకుండా చేయాలని ప్రజలు ఏకపక్షంగా నిర్ణయించుకొని 11 సీట్లకు పరిమితం చేసిన విషయం రజిని గుర్తు పెట్టుకుంటే బాగుంటుందని అన్నారు. రజినీకి అన్యాయం జరిగితే న్యాయ స్థానానికి వెళ్లి తేల్చుకోవాలి తప్ప, కూటమి ఏదో అన్యాయం చేసిందని అసత్య ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో చిన్న మస్తాన్‌వలి (నన్నే), అప్పారావు యాదవ్, ఎం ధారునాయక్, శ్రీకాంత్, మామిడి రామారావు, చెరుకూరి తిరుపతిరావు, కసుకుర్తి హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త కవుల ప్రోత్సాహానికి కవిత్వంతో కాసేపు



రచయిత్రి పద్మావతి ఇంట్లో కవిత్వంతో కాసేపు కార్యక్రమంలో పాల్గొన్న కవులు

గుంటూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కథా రచయిత్రి తాటికోల పద్మావతి ఇంట్లో కవులందరు కలసి 'కవిత్వంతో కాసేపు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభాని, కోశాధికారి నానా మాట్లాడుతూ కొత్త కవులను ప్రోత్సహించటమే ప్రధాన ధ్యేయంగా జిల్లా రచయితల సంఘం పని చేస్తుందని అన్నారు. ఇందులో పాల్గొన్న కవులు తాము రాసిన కవితతో పాటు సమకాలీన కవులు రాసిన, తమకు నచ్చిన మరో కవిత వినిపించారు. రచయితల సంఘానికి కొత్తగా పరిచయమైన కవులు మెట్టు శ్రీని వాసరెడ్డి, సురేష్, కడంశెట్టి సతీష్‌కుమార్‌లు మాట్లాడుతూ ఇది కవి సంగమం అని, ఇలా కలవటం తమకు సంతోషంతో పాటు ప్రోత్సాహాన్నిచ్చిందన్నారు. రచయిత్రి తాటికోల పద్మావతి ఆతిథ్యం, ఆప్యాయతలను కవులు కొనియాడారు. కార్యక్రమంలో రచయితల సంఘం ఉపాధ్యక్షులు బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి, సభ్యులు ఈవూరి వెంకటరెడ్డి, కొణ తం నాగేశ్వరరావు, వశిష్ట సోమేపల్లి పాల్గొన్నారు.

భవిష్యత్తు సాంకేతిక నైపుణ్యాలకు దిక్సూచి కృత్రిమ మేధ

● అటైన్‌స్మార్ట్ సొల్యూషన్ రిసోర్సుపర్సన్ సూర్యప్రకాశ్



మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

గుంటూరు(విద్య), మార్చి 24(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు సాంకేతిక నైపుణ్యాలకు దిక్సూచి కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) అని అటైన్‌స్మార్ట్ సొల్యూషన్స్ రిసోర్సు పర్సన్ ఎల్ సూర్యప్రకాశ్ అన్నారు. బుడంపాడులోని జీవీఆర్అండ్ఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం అటైన్‌స్మార్ట్ సొల్యూషన్(హైదరాబాద్), జీవీఆర్అండ్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఏఐపై నిర్వహించిన జాతీయ వర్క్‌షాపునకు ఆయన ముఖ్యఅతిథిగా హాజ రయ్యారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అనేక రంగాల్లో సమాజాన్ని శాసించే స్థాయికి ఏఐ ఎదిగిందన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్‌పర్సన్ సింధూర, కళాశాల డైరెక్టర్ షేక్ కరిముల్లా, ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌నాయుడు, డీన్ బి.వరప్రసాద్ వివిధ విభాగాల అధిపతు లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- శాఖమూరులో 300 ఎకరాల్లో ఏర్పాటు
- పార్కు మధ్య భారీ జలాశయం
- చుట్టూ పార్కులు, వినోద కేంద్రాలు
- హైలెట్‌గా వైల్డర్‌నెస్ పార్కు
- ఇప్పటికే ఆరంభమైన పనులు

అమరావతికే ప్రత్యేకాకర్షణ సెంట్రల్ పార్కు



(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

రాజధాని అమరావతిలో ప్రతీ నిర్మాణమూ ఓ ప్రత్యేకతతో కూడుకున్నదే! ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి పట్టుదలతో ఆవిర్భవిస్తున్న అమరావతి నగరం...మరికొద్ది కాలంలోనే ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బ్లూగ్రీన్ ఫీల్డ్ నగరంగా రూపుదిద్దుకోనుంది. ఈ నగరంలో ప్రతీది కళాత్మకంగాను పర్యావరణ వ్యూహానికి పునాదిగాను వుండబోతుంది. నగరంలో 60శాతం ప్రాంతం పచ్చదనం, నీటితో ఆక్రమించబడినట్టు కనిపిస్తూ చాల అద్భుతంగా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ముఖ్యంగా గవర్నమెంట్ కోర్‌గా పిలువబడే ప్రాంతం 5.5 కిలోమీటర్లు / 1 కిలోమీటరు నిడివిలో న్యూయర్క్ సెంట్రల్ పార్కు స్ఫూర్తిగా దర్శనమివ్వబోతుంది. సరిగ్గా ఈ ప్రభుత్వ భవనసముదాయ ప్రాంగణానికి దిగువగా కనిపించే ప్రాంతంలో రాజధానికే ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా సెంట్రల్ పార్కు నిర్మాణాన్ని చేపడుతున్నారు. నిజానికి అమరావతిలో దీనిని ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుగా భావిస్తున్నారు. ఈ పార్కు నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. సుమారు 300 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటవుతున్న ఈ పార్కు రాజధాని అమరావతికే కాదు...దక్షిణ భారతదేశంలోనే ఓ గొప్ప పర్యాటకకేంద్రంగా రూపుదిద్దుకోబోతుంది.


అమరావతి డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ సెంట్రల్ పార్కును నిర్మిస్తున్నారు. ఇది రాజధాని ఏరియాలోని ప్రభుత్వ భవన సముదాయానికి దిగువన అంటే శాఖమూరు పరిధిలో ఏర్పాటవుతోంది. మొత్తం 300 ఎకరాలకు గాను మధ్యలో 50.69 ఎకరాల విస్తీర్ణంలో ఓ సుందరమైన జలాశయాన్ని ఏర్పాటుచేస్తున్నారు. ఈ జలాశయం పనులు ఇప్పటికే మొదలయ్యాయి. అనంతరవం కొండల నుంచి వచ్చే వరదజలాలను ఈ జలాశయానికి మళ్లిస్తారు. అంటే ఈ జలాశయాన్ని వరద నివారణ చర్యలతోపాటు ఆహ్లాదకరంగాను, పర్యాటకంగాను వుండేలా వినియోగించుకోబోతున్నారన్నమాట! .మొత్తం ప్రాజెక్టు పూర్తయ్యాక ఈ జలాశయంలో బోటింగ్‌కు కూడ అనుమతిస్తారు. ఇందుకోసం జలాశయానికి ఓవైపుగా ఎకరం విస్తీర్ణంలో బోటింగ్ అండ్ వాటర్ స్పోర్ట్స్ జోన్‌ను ఏర్పాటుచేస్తున్నారు. ఈ జలాశయం చుట్టూ సందర్శకులను ఆకట్టుకునేలా వేర్వేరు సాంస్కృతిక, పర్యాటక ఆహ్లాదకర కేంద్రాలను విభిన్నంగా ఏర్పాటు చేస్తారు. జలాశయానికి ఉత్తరంగా పుష్పక్ పేరుతో 23 ఎకరాల విస్తీర్ణంలో ఫ్లవర్ గార్డెన్‌ను ఏర్పాటుచేస్తారు. దీని పక్కనే ఫ్యూచర్ డెవలప్‌మెంట్ ఏరియా పేరుతో 18.8 ఎకరాల ఖాళీ స్థలాన్ని వుంచుతున్నారు. దానిపక్కనే 30.07 ఎకరాల విస్తీర్ణంలో ఎమ్యూజ్‌మెంట్ పార్కును , దానికి కొంచెం పై ఎత్తులో వుండేవిధంగా 7.42 ఎకరాలలో క్రాఫ్ట్ బజారును ఏర్పాటుచేస్తారు. జలాశయానికి తూర్పు మధ్యస్థంగా ఎడ్వంచర్ పార్కు (పిల్లల సాహస ఉద్యానవనం)ను 15 ఎకరాలలో ఏర్పాటు చేస్తున్నారు. దాని పక్కనే మరో 20 ఎకరాల విస్తీర్ణంలో చాల ప్రత్యేకమైన రీతిలో వైల్డర్‌నెస్ పార్కును ఏర్పాటు చేస్తున్నారు. సందర్శకులకు అడవి అనుభవాన్ని అందించేవిధంగా దీనిని చాల ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అంటే ఇందులో ఫారెస్ట్ థీమ్ సెటప్‌తోపాటు బర్డ్స్ పార్కు, రైన్ ఫారెస్ట్ కేఫ్, టెంటెడ్ కాటేజీలు, టెంటెడ్ క్యాంపులు, ఫారెస్ట్ రెస్టారెంట్‌ల వంటివాటిని ఏర్పాటుచేస్తారు. ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకునేలా ఈ వైల్డర్‌నెస్ పార్కు చాల అద్భుతంగా ఏర్పాటుకాబోతుంది. ఈ పార్కులో చాల విలువైన వృక్షాలను కూడ ఏర్పాటుచేస్తారు. ముఖ్యంగా పురాతన మూలికా మొక్కలతోపాటు మహాశివునికి ప్రీతిపాత్రమైందిగా భావించే మహాబిల్వ తోపాటు రుద్రాక్ష మొక్కలను కూడ ఇందులో ఏర్పాటుచేస్తారు. అవసరాన్ని బట్టి ట్రాన్స్ లోకేట్ పద్ధతిలో ఈ చెట్లను పార్కులోనికి తరలించాలనే ఆలోచన చేస్తున్నారు.. జలాశయానికి పశ్చిమంగా 18.8 ఎకరాల విస్తీర్ణంలో ఏడీసీఎల్ వారి ఆధ్వర్యంలో ఓ నర్సరీని ఏర్పాటుచేస్తారు. దీనికి సమీపంలో 4.25 ఎకరాలలో స్పోర్ట్స్ అండ్ రిక్రియేషన్ క్లబ్‌ను, మరో పదెకరాలలో ఎకోపార్కును ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం పార్కుకు నైరుతీదశలో పార్కు నిర్వహణ బాధ్యతలను చూసేందుకుగాను ఏడీసీఎల్ వారి పాలనా భవనాన్ని 1.57 ఎకరాలలో నిర్మిస్తారు. దీనికి చేరువలో అంటే దక్షిణంలో మూడు నక్షత్రాల హోదాగల రిసార్టులను 3.05 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయబోతున్నారు.

ఇవికాకుండా పార్కులో మూడు వేర్వేరు ప్రాంతాలలో ఒక్కోటి రెండేసి ఎకరాల విస్తీర్ణంలో వుండేలా మొత్తం మూడు పార్కింగ్ ఏరియాలను ఏర్పాటుచేస్తారు. పార్కులో ఎటునుంచి ఎటు వెళ్లాలన్నా 25 మీటర్ల వెడల్పుకలిగిన రహదారులు వుంటాయి. వీటితోపాటు షాపింగ్‌మాల్స్, మల్టీప్లెక్సులు, ఫుడ్‌కోర్టులతో కూడిన రెండు కుటుంబ వినోదకేంద్రాలు, వినోద ఉద్యానవనం, యాంఫీ థియేటర్లు, మ్యూజికల్ ఫౌంటేన్ అండ్ లేజర్ షోలను కూడ ఏర్పాటు చేస్తారు. వేయి చదరపు గజాలలో పార్కు చుట్టూ తిరగడానికి పర్యావరణ అనుకూలమైన ట్రాకలెస్ టాయ్ ట్రైన్‌ను కూడ సందర్శకులకు అందుబాటులో వుంచుతారు. మొత్తంమీద రాజధాని అమరావతికి ఈ పార్కు ఓ పెద్ద ఎస్సెట్‌లా వుండబోతుంది. అమరావతి ఖ్యాతిని దశదిశలా పెంచేలా దీనిని నిర్మిస్తున్నారు. ఈ పార్కుద్వారా పర్యావరణహిత పర్యాటకాభివృద్ధి, ముఖ్యంగా విదేశీ పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా దీనిని నిర్మిస్తున్నారు.

ఈ మొత్తం సెంట్రల్‌పార్కులో మధ్య 50.69 ఎకరాలు జలాశయానికి పోగా, దాని చుట్టూ వివిధ రకాల పార్కులను 93.65 ఎకరాల విస్తీర్ణంలో పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ కింద ఏర్పాటు చేస్తున్నారు. మరో 107.79 ఎకరాల్లో రిసార్టులు, మూడు, అయిదు నక్షత్రాల హోటళ్లు, పార్కింగ్ ప్రదేశాలు, కుటుంబ వినోదకేంద్రాలను ఏడీసీఎల్ ఏర్పాటుచేస్తుంది. ఈ సెంట్రల్‌పార్కు అభివృద్ధి పనులను ప్రస్తుతం ప్రగతి గ్రీన్ రిసార్ట్స్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టారు. శాఖమూరులో ఏర్పాటవుతున్న ఈ సెంట్రల్‌పార్కుతోపాటు మల్కాపురం వద్ద 21 ఎకరాలలోను, అనంతవరం వద్ద 35 ఎకరాల్లోను మరో రెండు పార్కులను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేస్తుంది. ఈ పార్కులోనే స్వర్గీయ పొట్టి శ్రీరాములు స్మారకవనాన్ని కూడ ఏర్పాటుచేసే దిశగా రాష్ట్రప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తుంది.



పార్కు మధ్యలో ఏర్పాటవుతున్న జలాశయం



శాఖమూరులో ఏర్పాటవుతున్న సెంట్రల్ పార్కు తాలూకు మాస్టర్‌ప్లాన్

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆర్వీఆర్‌జేసీ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

గుంటూరు(విద్య), మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 8 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి ఇప్పటివరకు 753 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని వివరించారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్అండ్‌డీ డైరెక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ఎన్‌వీ శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు సీహెచ్ శ్రీనివాస రావు, సురేష్‌బాబు అభినందించారు.

29 నుంచి తెనాలిలో జాతీయ ఎడ్ల బలప్రదర్శన

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలిరూరల్, మార్చి24(ఆంధ్ర జ్యోతి): తెనాలి వ్యవసాయమార్కెట్ యార్డులో ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 4వరకు జాతీయ ఎడ్లబల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయమార్కెట్ యార్డులో ఏర్పాట్లను ఆయన పార్టీ నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రైతులను ప్రోత్సహించేలా ఎడ్లబలప్రదర్శన పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీలలో పాల్గొని విజయం సాధించిన ఎడ్లజతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. ఇదే ప్రాంగణంలో పశుపాల పోటీలు, పశువుల అందాల పోటీలు సైతం నిర్వహించడం జరుగుతుందన్నారు. వ్యవసాయంలో వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకునేలా అవగాహన, సాంకేతిక పరిజ్ఞానంతో హార్టికల్చర్, అగ్రికల్చర్‌లో వచ్చిన యంత్రాల ప్రదర్శనలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పర్యవేక్షణలో 18కమిటీలు పనిచేస్తు వివరించారు. సుమారుగా 125 నుంచి 150 జతల వరకు పోటీల్లో పాల్గొననున్నట్లు తెలియజేశారు. పెద్దఎత్తున ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల్లో ప్రముఖులు పాల్గొంటారని కుల,మత,రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో కూటమి నాయకులు, నిర్వాహక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం రైతులకు 227 రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు



సీఆర్‌డీఏ కార్యాలయంలో రైతుకు ప్లాటు కేటాయిస్తున్న అధికారులు

విజయవాడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గవర్నర్‌పేట, లెనిన్ సెంటర్‌లోని ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) కార్యాలయంలో సోమవారం ఈ-లాటరీ విధానం ద్వారా గన్నవరం రైతులకు 227 రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించారు. గన్నవరం విమానాశ్రయం అభివృద్ధికి భూమి లిచ్చిన 99 మంది రైతులకు 227 రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించారు. వీటిలో 147 నివాస ప్లాట్లు కాగా, 80 వాణిజ్య ప్లాట్లున్నాయి. ఈ-లాటరీకి హాజరైన రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రయల్ రన్ వేసి తరువాత ప్రత్యక్ష లాటరీ ప్రక్రియను నిర్వహించారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు గుడివాడ రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్‌డీవో) బాలసుబ్రహ్మణ్యంతో కలిసి సీఆర్‌డీఏ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ సేకరణ) ఎన్.ఎస్.వి.బి వసంత నాయుడు మాట్లాడుతూ ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించబడ్డాయో వివరించటానికి ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించామన్నారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి రుసుము వసూలు చేయబడదన్నారు. సీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతికతను చేరవేయటంలో కేవీకేలదే కీలక పాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జీవీ రమణ


లాంఫాం(తాడికొండ)మార్చి 24(ఆంధ్రజ్యోతి): పరిశోధనల్లో రూపుదిద్దుకున్న సాంకేతికతను రైతులకు చేరవేయటంలో కృషి విజ్ఞాన కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవి ద్యాలయం ఉపకులపతి డాక్టర్ జేవీ రమణ పేర్కొ న్నారు. సోమవారం లాంఫాంలోని కృషి విజ్ఞాన కేంద్రం లో శాస్త్రీయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహిం చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ రమణ ఈ సందర్భంగా మాట్లాడారు. పాడి రైతులకు వ్యవసాయంలో కావాల్సిన సలహాలు, సూచనలు ఎప్ప టికప్పుడు కేవీకే శాస్త్రవేత్తలు ఇస్తున్నారన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు రైతులకు అందుబాటులో ఉన్నారని తెలిపారు. కేవీకేల ద్వారా అనేక సర్టిఫికెట్ కోర్సులను అందుబాటులో తీసుకువచ్చారన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మి మాట్లాడుతూ శాస్త్రీయ సలహా మండలి సూచనలు, సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందించే క్రమంలో అంతరాలను గుర్తించి వాటిని పూరించటానికి కేవీకే పనితీరు మెరుగుపరచడానికి ఎంతో కీలకమైనవని తెలిపారు. అనంతరం 2024-25 సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. 2025-26 కార్యచరణ ప్రణాళికలను వివరించారు. కార్యక్రమంలో ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో డాక్టర్ శ్రీనివాసరావు, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ బీ.రేఖామణి, లాంఫాం కేవీకే అధినేత డాక్టర్ ఎం.యుగంధర్, డాక్టర్ శివనారాయణ, పశుసంవర్థక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ వో.నరసింహారావు, ఎల్‌ఆర్ఎస్ హెడ్ డాక్టర్ ముత్తారావు, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ దీపా పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్‌లకు రూ.28.09 కోట్ల నిధుల విడుదల

తెనాలి అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో స్కూల్ కాంప్లెక్స్‌లకు రూ.28.09 కోట్లు విడుదల చేశారు. సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో క్లష్టర్‌కు ఒక స్కూల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసి ప్రతి నెలా ఒక రోజు ఉపాధ్యాయులకు సమావేశాలు నిర్వహించి శిక్షణ అందిస్తున్నారు. ఇందుకోసం ఒక్కో కాంప్లెక్స్‌కు రూ.లక్ష కేటాయించారు. వీటిల్లో సమావేశాలకు హాజరయ్యే ఉపాధ్యాయుల ట్రావెలింగ్ అలవెన్స్ కింద రూ.10 వేలు, నిర్వహణ కింద రూ.30 వేలు, కంటిమ్‌జెన్సీ గ్రాంట్ రూ.35 వేలు, బోధన ఉపకరణాలకు రూ.25 వేలు కేటాయించారు. ఈ విద్యా సంవత్సరానికి గాను కేటాయించిన నిధులను సద్వినియోగం చేసి బిల్లులు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రంలో 2809 క్లష్టర్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లాకు రూ.64 లక్షలు, బాపట్ల జిల్లాకు రూ.79 లక్షలు, పల్నాడు జిల్లాకు 107 లక్షలు విడుదల అయ్యాయి.

అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్‌పై వేటు

వీఆర్‌కు పంపుతూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశాలు



గుంటూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాలోని అచ్చంపేట సీఐ కే వెంకట ప్రసాద్‌పై వేటుపడింది. ఆయనను వీఆర్‌కు పంపుతూ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన ఎస్ఐగా పల్నాడుతో పాటు జిల్లాలోని పలు స్టేషన్లలో విధులు నిర్వహించారు. సీఐగా ఉద్యోగోన్నతి పొందిన తరు వాత గుంటూరు స్పెషల్ బ్రాంచ్‌లో గత ఎన్నికల సమయంలో విధులు నిర్వహించారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వెంకటప్రసాద్‌ను అచ్చంపేట సీఐగా నియమించారు. సమర్థవంతంగా విధులు నిర్వహించలేకపోయారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలోని పార్టీల నాయకులకు సహకరించకపోగా ఆయన వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అపవాదు మూటగట్టుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రంధసిరి గ్రామానికి సంబంధించిన వైసీపీ నాయకుడిపై నమోదైన కేసులో ఆయన వైసీపీకి అనుకూలంగా వ్యవహరించినట్లు టీడీపీ శ్రేణులు ఆరోపించాయి. ఆ కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకున్న కానిస్టేబుల్ అతన్ని వదిలి వేశాడు. ఈ వ్యవహారం వివాదాస్పదం కావడం తో కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. అయితే సీఐకు తెలియకుండా వైసీపీ నాయకుడిని వదిలిపెట్టి ఉండరనే ఆరోపణలు వచ్చాయి. సుమారు ఐదారు నెలల క్రితం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటన అనంతరం కూడా సీఐ వెంకట ప్రసాద్‌లో మార్పు రాలేదు. ప్రతిపక్ష వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు టీడీపీ నాయకులు ఆరోపించారు. మరోవైపు పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేయడంలోనూ విఫలమవుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఆయన పనితీరు ఏమాత్రం సంతృప్తికరంగా లేదని నిఘవర్గాలు ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాయి. వీటన్నింటి నేపథ్యంలో వెంకటప్రసాద్‌ను వీఆర్‌కు పంపుతూ ఐజీ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎయిర్ ట్యాక్సీ @ గుంటూరు

అత్యాధునిక ప్రయాణ సాధనాన్ని ఆవిష్కరించిన ఆంధ్రా కుర్రోడు



గుంటూరు సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎయిర్ ట్యాక్సీ పేరుతో అధునాతన గగన రవాణాకు ఉపకరించే ప్రయాణ సాధనం గుంటూరులో రూపుదిద్దుకుంటుంది. ఇప్పటివరకు ప్రపంచంలో కేవలం చైనాకు మాత్రమే పరిమి తమైన అధునాతన రవాణా వ్యవస్థను గుంటూరుకు చెం దిన యువ రోబోటిక్స్ ఇంజినీర్ అభిరామ్ చావా పరిచయం చేస్తున్నాడు. ప్రయోగాలు అన్నీ పూర్తి చేసుకుని కేంద్ర ప్రభుత్వం అనుమతి కోసం ఎదురు చూస్తున్నాడు. అభిరామ్ అమెరికాలో రోబోటిక్స్ ఇంజినీరింగ్ పీజీ పూర్తి చేశాడు. ఆయనలోని సాంకేతిక పరిజ్ఞానాన్ని గుర్తించిన అమెరికా, చైనా లోని పేరొందిన సంస్థలు ఎక్కువ మొత్తం జీతంతో ఉద్యోగాన్ని ఇచ్చేందుకు ఆసక్తి చూపించాయి. నేర్చుకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశానికి సేవ చేసేందుకు మాత్రమే వినియోగించాలని సంకల్పించిన అభిరామ్ 2017లో గుంటూరుకు వచ్చేశారు.

మ్యాగ్నం వింగ్స్‌కు అంకురార్పణ

గుంటూరు ఏటుకూరు రోడ్డులో మ్యాగ్నం వింగ్స్ అనే సంస్థలో వీ-2 పేరుతో ఎయిర్ ట్యాక్సీ తయా రీకి ఉపక్రమించారు. ఎయిర్ ట్యాక్సీ తయారీకి వినియోగించే ప్రతి వస్తువును స్వయంగా తయారు చేశారు. రెండు, మూడేళ్ల శ్రమ తర్వాత వీ-2 ప్రయోగానికి సంపూర్ణంగా సిద్ధమైంది. ప్రయోగం పూర్తిగా సఫలం కావడంతో ఎక్స్-4 పేరుతో ఎయిర్ క్రాఫ్ట్ తయారు చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం అది ప్రయోగానికి సిద్ధమవుతుంది.

ప్రయాణం ఇక సులువు..

అభిరామ్ తయారు చేసిన ఎయిర్ ట్యాక్సీ వినియోగం ద్వారా ప్రయాణం సులువు అవుతుంది. ఉదాహరణకు గన్న వరం విమానాశ్రయం నుంచి విజయవాడకి వచ్చేందుకు ట్రాఫిక్ అవాంతరాలు ఎదురవుతాయి. అదే ఎయిర్ ట్యాక్సీలో ఆ సమస్య ఉండదు. ఉదాహరణకు రోడ్డు మార్గం ద్వారా 30 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి గమ్యస్థానం చేరుకుంటే, ఎయిర్ ట్యాక్సీలో కేవలం 10 కిలోమీటర్లు ప్రయాణించి గమ్యస్థానం చేరవచ్చు. వీ-2 భూమి నుంచి 1100 అడుగులో 100 కిలోమీటర్ల వేగంతో నడుస్తోంది. ఎక్స్- 4 మాత్రం భూమి నుంచి రెండు వేల అడుగుల దూరంలో 300 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. అభిరామ్ తయారు చేసిన రెండు అత్యధునాతన ప్రయాణ సాధనాలు అటానమస్ సిస్టం(స్వయం నియంత్రణ) విధానంలోనే పనిచేస్తాయి. ప్రో మొబిలిటీ కాన్సెప్ట్ (సంభావ్యత)తో రూపొందించారు. రెండు వాహనాలు బ్యాటరీతో పనిచేస్తాయి. ఎక్స్- 4ను ఇంధనంతో కూడా నడపవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో ఎయిర్ క్రాఫ్ట్ ను అంబులెన్స్‌గా వినియోగించవచ్చు.

క్యాబ్ ఖర్చుతో అందుబాటులోకి..

చూడటానికి విమానం, హెలికాప్టర్‌లా ఉండే ఎయిర్ ట్యాక్సీలో ప్రయాణ ఖర్చు కూడా తక్కువే. క్యాబ్‌కు అయ్యే ప్రయాణ ఖర్చు మాత్రమే అవుతుంది. వీ-2, ఎక్స్- 4 కొనుగోలు ఖర్చు మాత్రం రూ.2 కోట్ల వరకు ఉంటుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అనుమతి కోసం ఎదురు చూస్తున్నట్టు అభిరామ్ తెలిపారు. అది చట్టం రూపేణా అమల్లోకి రావడానికి ఏడాది పడుతుందని తెలిపారు. మొదట్లో పైలెట్ లేకుండా ప్రయాణించే విధంగా తయారు చేశామని తెలిపారు. ప్రభుత్వం అందుకు అనుమతి ఇస్తుందో లేదో చూడాలన్నారు. భూమి మీద నుంచి గగనతలంలో వెళ్లే ఈ వాహనాలను నియంత్రించవచ్చని తెలిపారు. డాబాపై ల్యాండింగ్ చేయవచ్చన్నారు. టేకాఫ్, ల్యాడింగ్ రోడ్డుపై చేసేలా తయారు చేశామని తెలిపారు.



అభిరామ్ చావా తయారు చేసిన ఎయిర్ ట్యాక్సీ

దేశానికి వినియోగపడితే చాలు..

నేను చదివిన చదువు ఈ దేశానికి మొదట ఉపయోగపడాలి. ఆ ఉద్దేశంతోనే ఇక్కడకు వచ్చి వీ-2 వాహనం తయారు చేశాను. ఎక్స్- 4 కూడా రెండు, మూడు నెలల్లో ప్రయోగిస్తాం. ప్రభుత్వం అనుమతి ఇస్తే రోజుకు ఒకటి తయారు చేయవచ్చు. రాష్ట్ర ప్రభుత్వంతో కొన్ని సంప్రదింపులు జరుతున్నాయి.

అభిరామ్ చావా,మ్యాగ్నం వింగ్స్ అధినేత

563 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయమార్కెట్ కమిటీ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 563 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,700, గరిష్ఠధర రూ.12.011, మోడల్‌ధర రూ.10,500 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,700, గరిష్ఠధర రూ.12.011, మోడల్‌ధర రూ. 10,975 పలికాయి.

ఇష్టానుసారంగా చెట్లు నరికివేత

● మొక్కలు పెంచాలని ప్రభుత్వం ప్రకటనలు
● అభివృద్ధి పేరుతో చెట్లు నరికివేత మరొక వైపు





కంతేరు రోడ్డులో చెట్లు నరికివేయటంతో మోడుగా మారిన దృశ్యం



తాడికొండ-కంతేరు గ్రామాల మధ్య ఉన్న చెట్లను నరికివేసిన దృశ్యం

తాడికొండ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించటం కోసం మొక్కలు నాటాలని ఒక వైపు ప్రభుత్వం ప్రకటనలు చేస్తుంటే.. మరొక వైపు అభివృద్ధి పేరిట అవే చెట్లను ఇష్టానుసారంగా నరికివేస్తున్నారు. చెట్లను పెంచటం వల్ల కాలనీకి అనుగుణంగా వర్షాలు సకాలంలో పడి నీటి ఎద్దడి లేకుండా ఉంటాయి. కానీ మరో వైపు అభివృద్ధి పేరుతో పెద్ద పెద్ద చెట్లను నేలకూల్చుతున్నారు. చెట్లు ఎక్కువగా ఉండటం వల్ల వేసవి కాలంలో ఎండల ఉధృతి తగ్గుతుంది. కాగా తాడికొండ మండలపరిధిలో చెట్ల పరిస్థితి మరోవిధంగా ఉంది. విద్యుత్ స్తంభాలు, లైన్లు వేయటానికి, రోడ్ల విస్తీర్ణం పెంచడం పేరుతో రోడ్లకు ఇరువైపులా ఉన్న పెద్దపెద్ద చెట్లను నరికివేస్తున్నారు. తాడికొండ-కంతేరు గ్రామాల మధ్య విద్యుత్ శాఖ నూతనంగా విద్యుత్ స్తంభాలను వేసి విద్యుత్ లైన్లు లాగింది. దీంతో స్తంభాలకు అడ్డుగా ఉన్న పెద్దపెద్ద చెట్లను తొలగించి వేసింది. చెట్ల కొమ్మలతో పాటు, కొన్ని చెట్లు మొదలు వరకు నరికివేశారు. తాడికొండ అడ్డరోడ్డు నుంచి పొన్నెకల్లు వెళ్లే ప్రధాన రహదారిలో కూడా తమ రియల్ ఎస్టేట్ భూముల అభివృద్ధి కోసం చెట్లను నరికివేసిన దృశ్యం కన్పిస్తుంది. దీంతో ఆయా మార్గాల్లో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు కాసేపు ఎండ నుంచి తప్పించుకోవటానికి చెట్ల కిందకు వెళ్లలేని పరిస్థితి. ప్రజలతో పాటు, పశుపక్షాదులు సేదతీరటానికి అస్కారం లేకుంగా పోయింది. బాటసారులకు నిలువనీడ లేకుండా చేశారు. కొమ్మలను నరికివేస్తే తిరిగి కొమ్మలు వస్తాయి.. కానీ చెట్టు మొదల వరకు నరికి వేశారు. ప్రతి సంవత్సరం విద్యుత్ లైన్ల మరమ్మతుల పేరిట చెట్ల కొమ్మలను విద్యుత్ సిబ్బంది నరివేస్తుంటారు. అలా చేస్తే బాగుండేదని ప్రయాణికులు, బాటసారులు, రైతులు, కూలీలు వాపోతున్నారు. చెట్లు నీడను ఇవ్వటమే కాకుండా కార్బన్‌డైయాక్సైడ్ పీల్చుకొని ఆక్సిజన్ విడుదల చేస్తాయి. మారుతున్న కాలంలో రోజు రోజుకు ఎండలు పెరుతున్నాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి చెట్లను తొలగించకుండా అభివృద్ధి పనులు చేస్తే బాగుటుందని ప్రజలు కోరుకుంటున్నారు.

ఫిరంగిపురంలో అర్ధరాత్రి ఉద్రిక్తత

● స్థల వివాదంలో ఇరువర్గాలు ఘర్షణ .. సీఐపై దాడి
● ఎస్పీ సహా భారీగా చేరుకున్న బలగాలు



ఫిరంగిపురం రోడ్డుపై ఘర్షణ పడుతున్న రెండు వర్గాల ప్రజలు

గుంటూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలో సోమవారం రాత్రి ఉద్రిక్తత నెలకొంది. ఓ స్థల వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. స్థల వివాదంపై మంగళవారం చర్యలు తీసుకుంటామని అప్పటివరకు శాంతియుతంగా ఉండమని తహసీల్దార్ హెచ్చరించి వెళ్లారు. అయినప్పటికీ గేరా చిన్ని అనే వ్యక్తి ఆ స్థలంలో పోల్స్ వేస్తుండగా మరో వర్గం అడ్డుకునేందుకు వచ్చింది. దీంతో పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా కుదరలేదు. సమాచారం అందుకున్న ఫిరంగిపురం సీఐ రవీంద్రబాబు ఘటనా స్థలానికి వెళ్లి అదుపుచేసే ప్రయత్నం చేయగా ఆయనపై దాడి చేసి నెట్టేశారు. దీంతో ఆయన కాలువలో పడిపోయారు. శాంతించని ఆందోళనకారులు సీఐ వాహనంపై దాడి చేసి వాహనం ధ్వంసం చేశారు. ఒక్కసారిగా పరిస్థితి ఉద్రిక్తంగా మారటంతో ఎస్పీ సతీష్‌కుమార్‌తోపాటు జిల్లా కేంద్రం నుంచి పలువురు సీఐలు, అదనపు బలగాలతో ఫిరంగిపురం చేరుకున్నారు. అయితే ఒక వర్గం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకోకు దిగింది. దీంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఎస్పీ, పోలీసు అధికారులు ఆందోళనకారులతో చర్చలు జరుపుతున్నారు.

వాహన తనిఖీలు ప్రభుత్వమే నిర్వహించాలి

● వేముల దుర్గారావు

తాడేపల్లి టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రవాణా రంగంలో ఆటోలు, ట్రక్కులు, లారీలు తదితర వాహనాలు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే తనిఖీలు నిర్వహించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి మణిపాల్ ఆస్పత్రి వద్ద ఆటో కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దుర్మార్గంగా తీసుకువచ్చిన జీవో నెం.212ను రద్దు చేయాలన్నారు. ఈ జీవో వల్ల రవాణా కార్మికులపై విపరీతమైన అపరాధ రుసుం, విధించే అవకాశం ఉందన్నారు. భారీగా పెంచిన టారిఫ్‌ను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌ను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు కొట్టే కరుణాకర్, పల్లె కృష్ణ, ఎస్ఎం బాషా గోపి పాల్గొన్నారు.

ఆస్థాన అలంకారంలో రుక్మిణీ కల్యాణం



ఆకట్టుకున్న రుక్మిణీ కల్యాణ ఘట్టం

మంగళగిరిసిటీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీ నృసింహస్వామి వారి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి రుక్మిణీ కల్యాణం ఘట్టాన్ని అర్చకులు ఆవిష్కరించారు. ఈ అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మంగళగిరి పట్టణానికి చెందిన ప్రగడ నరసింహమూర్తి ఈ ఉత్సవానికి ఆస్థాన కైంకర్య పరులుగా వ్యవహరించారు. ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ.4,01,828

కాకుమాను, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొండపాటూరు శ్రీపోలేరమ్మ అమ్మవారి హుండీల లెక్కింపు కార్యక్రమం సోమవారం బాపట్ల దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ గోపి ఆధ్వర్యంలో జరిగింది. మూడు నెలల హుండీలోని నగదును లెక్కించగా రూ.4,01,828 వచ్చినట్లు ఆలయ ఈవో సురేష్ తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ముప్పా నాగేశ్వరరావు, పొన్నం శ్రీనివాసరావు, యర్రాకుల దానయ్య, కారుమంచి ప్రవీణ్, భాస్కరరావు, స్కౌట్స్ అండ్ గైడ్స్ చెందిన ఆర్ఎస్ఎల్ బాపారావు పాల్గొన్నారు.

క్షయ రహిత గ్రామంగా రాజుపాలెం



జిల్లా అధికారుల నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న సర్పంచ్ నాగమల్లేశ్వరరావు

పెదనందిపాడు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని రాజుపాలెం గ్రామాన్ని కేంద్ర ప్రభుత్వం క్షయ వ్యాధి రహిత గ్రామంగా ఎంపిక చేశారు. దీనిలో భాగంగా గుంటూరు వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం గ్రామ సర్పంచ్ కమ్మ నాగమల్లేశ్వరరావుకు జిల్లా ప్రభుత్వ ఆరోగ్య శాఖ అధికారులు ప్రశంసాపత్రంలో పాటుగా జ్ఞాపికను అందజేశారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

పెదనందిపాడు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఏబీ పాలెం, పెదనందిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పది పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి రేణుక ఆకస్మిక తనిఖీలు సోమవారం నిర్వహించారు. పరీక్షలు జరుగుతున్న తీరు, విద్యార్థుల హాజరు శాతం, ఇన్విజిలేటర్ల పని తీరు తదితర అంశాల గురించి వాకబు చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మాస్ కాపీలకు పాల్పడితే డీబార్ అవుతారని హెచ్చరించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ కూడా తనిఖీలు నిర్వహించింది.

సమస్యలు పరిష్కరించాలి

మంగళగిరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కమిషనర్ అలీం బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. పర్మినెంట్ కార్మికులకు చెప్పులు, సబ్బులు, నూనె, యూనిఫారం, ఇంక్రిమెంట్, డీఏ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఎస్ఎస్ చెంగయ్య, సీఐటీయూ పట్టణ కార్యదర్శి బాలాజీ, నేతలు శ్రీనివాసరావు, రమణమ్మ, శివపార్వతి, తిరుపతమ్మ, వెంకటేశ్వర్లు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ ఉమాకు మాతృవియోగం

మంగళగిరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, టీడీపీ నేత ఆకుల ఉమామహేశ్వరరావు మాతృమూర్తి ఆకుల మాణిక్యం (74) మృతి చెందింది. ఆమెకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మాణిక్యం సోమవారం సాయంత్రం తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. మంగళవారం ఉదయం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

తప్పుడు ప్రచారం ఎందుకు చేస్తున్నారు?

● ఏపీఎంపై డ్వాక్రా మహిళల ఆగ్రహం
● నిగ్గు తేల్చాలంటూ ఫిర్యాదు



ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఏపీఎం లాజరుపై ఫిర్యాదు చేస్తున్న డ్వాక్రా మహిళలు

ప్రత్తిపాడు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వీవోఏ మా గ్రూపుల్లో డబ్బులు తీసుకున్నదంటూ వాట్సప్ గ్రూపుల్లో ప్రచారం చేస్తున్నారు. దీంతో ఇంట్లో మావాళ్లు మమ్మల్ని ఇబ్బందులు పెడుతున్నారు.. మేము ఒక్క రూపాయి కూడా ఇచ్చింది లేదు.. అయినా తప్పుడు ప్రచారం చేయడం ఏమిటంటూ ప్రత్తిపాడు గ్రామైఖ్య సంఘానికి చెందిన వివిధ డ్వాక్రా గ్రూపుల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ డ్వాక్రా సంఘాల మహిళలు ఏపీఎం లాజరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మా గ్రూపులకు సంబంధించి ఎలాంటి అవకతవకలు జరగలేదని, ఈ నెపంతో వీవోఏను విధుల నుంచి తొలగించినట్లు చెప్పడంలో వాస్తవం లేదన్నారు. మాకు సరైన సమాచారం ఇవ్వకుండా మాతో సంతకాలు చేయించుకుని వీవోఏను తొలగించారంటూ ఆరోపించారు. వీటిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలంటూ వారు ఎంపీడీవో శివపార్వతిని వేడుకున్నారు. దీనిపై వీరు అర్జీ ఇస్తే ఉన్నతాధికారుల ద్వారా విచారణ జరిపిస్తామని ఎంపీడీవో తెలిపారు. ఇదిలా ఉంటే తహసీల్దార్ కార్యాలయానికి మహిళలు ఎక్కువ మంది రావడంతో అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గతంలో కూడా గొట్టిపాడుకు చెందిన ఏపీఎంకు వ్యతిరేకంగా రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మరళా మహిళలు రోడ్డెక్కి ఆందోళన చేస్తారనే అనుమానంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన అక్కడకు చేరిన ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర డ్వాక్రా మహిళలకు మీ సమస్యను అధికారులకు తెలియజేయాలని, అలా కాకుండా రోడ్డెక్కితే కేసులు నమోదు చేయాల్సి వస్తుందంటూ హెచ్చరించారు.

వీవోఏలపై పోలీస్‌స్టేషన్‌లో కేసు

ప్రత్తిపాడు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు గ్రామానికి చెందిన ఇద్దరు వీవోఏలపై కేసు నమోదు చేశారు. సుమారు పది రోజుల క్రితం ఏపీఎం లాజరు వీవోఏలు అవినీతికి పాల్పడ్డారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన షేక్ షాజా, బోలే శివపార్వతిలు అక్రమాలకు పాల్పడ్డారంటూ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతే కాకుండా విచారణకు వెళితే ఆత్మహత్య చేసుకుంటామని తనను బెదిరిస్తున్నారని, అంతే కాకుండా బెదిరింపు కాల్స్ కూడా వస్తున్నాయని లాజరు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సోమవారం ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర కేసు నమోదు చేశారు.

మాజీ మంత్రి విడదల రజిని అక్రమాలు బట్టబయలు

తాడికొండ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): అధికారాన్ని అడ్డుపెట్టుకొని వ్యాపారులను బెదిరించి వారి నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసిన మాజీ మంత్రి విడదల రజిని అక్రమాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయని తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం మేదర సాధికారక సమితి రాష్ట్ర కన్వీనర్ ధూళిపాళ్ల ఏసుబాబు పేర్కొన్నారు. సోమవారం తాడికొండలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత విడదల రజిని అనేక అక్రమాలకు, దోపిడీలకు తెరతీశారని తెలిపారు. భూదందాలు, అక్రమ వసూళ్లు, గ్రానైట్ వ్యాపారుల్ని బెదిరించటంలో పేరుగాంచిన రజిని అడ్డంగా దొరికారన్నారు. అరెస్టు చేస్తారనే భయంతో బీసీ మహిళ అనే కార్డును ఉపయోగించి బీసీలను మోసం చేయాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. ఆమె చేసిన అక్రమాలు, దందాలు త్వరలోనే బయటకు వస్తాయని, బాధితులకు కూటమి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో రజిని తగిన మూల్యం చెల్లించక తప్పదని తెలిపారు.

ముమ్మరంగా రాజధానిలో పీ4 వేదిక పనులు



పీ4 వేదిక కోసం ఐరన్ ఛానల్స్‌తో సిద్ధం చేస్తున్న హాల్

తుళ్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ముమ్మరంగా రాజధాని అమరావతిలో పీ4 వేదిక పనులు జరుగుతున్నాయి. వెలగపూడి రాష్ట్ర సచివాలయం వెనక ప్రదేశంలో ఈ పనులు జరుగుతున్నాయి. ఈ నెల 30న ఉగాది పర్వదినం పురస్కరించుకొని ప్రభుత్వం ప్రైవేటు, దాతల భాగస్వామ్య (పీ4) ప్రారంభోత్సవం కార్యక్రమం జరగతుంది. కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరవుతున్నారు. ఇప్పటికే వేదిక హాలు ఐరన్ ఛానల్స్‌తో ఏర్పాటు చేస్తున్నారు. 50ఎకరాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ధనవంతులు గ్రామాల్లో పేదలను దత్తత తీసుకొని వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుకోసం చంద్రబాబు పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మంగళగిరి సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పెదవడ్లపూడిలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చెక్కులు మంజూరైన లబ్ధిదారులకు స్థానిక కూటమి నాయకులు సోమవారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన మన్నవ జ్యోతికి రూ. 1,70,727లు, షేక్ మస్తాన్‌కు రూ.43,727లు మంజూరు కాగా, సదరు చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. సీఎం సహాయనిధి చెక్కులు మంజూరు చేయించిన మంత్రి నారా లోకేశ్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు యేళ్ల శివరామయ్య, జనసేన అధ్యక్షుడు నడపన దుర్గారావు, కూటమి నేతలు మాదల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రాతూరులో జనసేన కార్యాలయం ప్రారంభం



జనసేన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చిల్లపల్లి శ్రీనివాసరావు

తాడేపల్లి (ప్రాతూరు), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ప్రాతూరులో జనసేన పార్టీ నూతన కార్యాలయాన్ని సోమవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం ప్రాతూరు కమిటిని ఎన్నుకున్నారు. చిల్లపల్లి మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షుడు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తాడేపల్లి మండల అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు కృషితో ప్రాతూరు గ్రామ కమిటి ఏర్పాటు అవటం స్థానికంగా నేతలు కార్యాలయ ఏర్పాటుకు అంకురార్పరణ చేయడం విశేషమన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కోమలి, మునగపాటి వెంకట మారుతీరావు, ఉపాధ్యక్షులు సాధు చంద్రశేఖర్, జనసేన మండల, పట్టణ అధ్యక్షులు, వీరమహిళలు పాల్గొన్నారు.

కమిటీ అధ్యక్షుడిగా సంకురు విజయసాగర్

జనసేన ప్రాతూరు కమిటీ అధ్యక్షుడిగా సంకురు విజయసాగర్, ఉపాధ్యక్షులుగా యాదల అభిషేక్ నందా, రాచర్ల బాలాజీ, ప్రధాన కార్యదర్శులు కళ్యాణ్, చంద్రశేఖర్, పసుపులేటి సుధీర్, కార్యదర్శులుగా దావులూరి బాలసుబ్రహ్మణ్యం, తలకాల ప్రవీణ్, సంకురు జోసఫ్ కుమార్, బట్టు రమేష్, మోదేపల్లి సాయిచంద్, కోపూరి రాయప్ప, గూడూరి కిషోర్‌బాబు ఎంపికయ్యారు.

కేఎల్‌రావు కాలనీలో జెండా దిమ్మె ఆవిష్కరణ

తాడేపల్లి టౌన్ (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలోని 19వ వార్డు కేఎల్ రావు కాలనీలో జనసేన జెండా దిమ్మెను చిల్లపల్లి శ్రీనివాసరావు ప్రారంభించి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అంబటి తిరుపతిరావు, మండల అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు, కేఎల్ రావు కాలనీ జనసేన ప్రతినిధులు వీరిశెట్టి వెంకటేశ్వరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కోమలి, ఎంటీఎంసీ జనసేన అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు, ఉపాధ్యక్షులు, వీరమహిళలు పాల్గొన్నారు.

మురుగునీరుతో ఇబ్బంది పడుతున్నాం

● సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పి.మధుకు స్థానికుల ఫిర్యాదు



స్థానికులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి మధు

తాడేపల్లి టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి సుందరయ్యనగర్ ప్రాంతంలో బైపాస్ రోడ్డు వీఆర్ అపార్టుమెంట్, మణిపాల్ వైద్యశాల ఏరియాల్లో మాజీ రాజ్యసభ సభ్యులు, సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పీ మధు స్థానిక నేతలతో కలిసి పర్యటించి సోమవారం స్థానికుల నుండి పలు సమస్యలు తెలుసుకున్నారు. స్థానికులు మాట్లాడుతూ ముఖ్యంగా సుందరయ్యనగర్ ప్రాంతంలో ఇళ్లలోనే సెప్టిక్ ట్యాంక్ మాదిరిగా మురుగునీటి కోసం ప్రత్యేక గుంతలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. అద్దెలకు వచ్చిన ఆదాయం మురుగునీరు ఎత్తిపోసుకునేందుకే సరిపోతోందని చెప్పారు. నీరు పారుదల లేక ఇళ్లమధ్య దుర్వాసన వస్తోందని అన్నం కూడా తినే పరిస్థితి లేదని చెప్పారు. మున్సిపాలిటికి అన్ని రకాల చార్జీలు చెల్లించినా తమకు తిప్పలు తప్పడం లేదని వాపోయారు.

కాగా అమరావతికి గేట్‌వేగా ఉన్న తాడేపల్లిలో విచిత్ర పరిస్థితి నెలకొని ఉందని మధు అన్నారు. ప్రజలు, రాజకీయ నేతలు మేల్కొని రాజకీయాలకు అతీతంగా మురుగునివారణకు కదిలి రావాలని ఇందుకు దశలవారీ కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్‌ను, మంత్రి లోకేశ్‌ను కలవాలని ప్రజలందరూ ఇందుకు సిద్ధంగా ఉండాలని మధు కోరారు. కార్యక్రమంలో వేముల దుర్గారావు, జొన్న విత్తుల శేషయ్య, వై నేతాజీ, బూరుగ వెంకటేశ్వర్లు, పల్లె కృష్ణ, కొట్టే కరుణాకర్, ప్రభాకర్ భుజంగరావు, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత పసుపు రైతులను ఆదుకోవాలి

గుంటూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది జనవరిలో దుగ్గిరాల, శుభమ్ మహేశ్వరీ కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో పంట నష్టపోయిన పసుపు రైతులను ఆదుకోవాలని రైతు సంఘ నాయకులు సోమవారం కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నిల్వ పెట్టుకున్న పసుపు బస్తాలను ప్రతి బస్తా 76 కేజీల చొప్పున లెక్కించి క్వింటాల్‌కు రూ.7వేలు ఇవ్వాలని కోరారు. 14నెలలుగా అధికారులు మా బాండ్లు అనేక మార్లు పరిశీ లించారని, ఏ రైతుది ఎంత సరుకు ఉందనే విషయాన్ని నిర్ధారించలేదని అన్నారు. ఈ రోజు వరకు పరిహారం అందక రైతులు ఇబ్బంది పడుతున్నారని, బ్యాంకు, ప్రైవేటు వ్యక్తుల వద్ద తీసుకున్న అప్పులపై వడ్డీలు పెరిగి ఆర్థికంగా చితికి పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో వెంకట్రామయ్య, సుబ్బారావు, సాంబిరెడ్డి తదితరులున్నారు.

దేవతి, మాజేటిలకు ఘనసన్మానం



డాక్టర్ భగవన్నారాయణను సన్మానిస్తున్న రచ్చబండ ఫ్రెండ్స్ సర్కిల్ ప్రతినిధులు

మంగళగిరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ పీస్ యూనివర్సిటీ తరపున ఇటీవల గౌరవ డాక్టరేట్ అందుకున్న డాక్టర్ దేవతి భగవన్నారాయణ, 25 సంవత్సరాలుగా భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్న మాజేటి సూర్యవేణుగోపాలకృష్ణలను రచ్చబండ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చీదెళ్ల వాసు అధ్యక్షతన జరిగిన సభలో పలువురు మాట్లాడుతూ ఆధ్యాత్మిక ధార్మిక సేవా కార్యక్రమాలు చేస్తున్న భగవన్నారాయణకు గౌరవ డాక్టరేట్ ఇవ్వడం సముచితమన్నారు. అలాగే, బ్రహ్మోత్సవాల్లో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేస్తున్న వేణుగోపాలకృష్ణ 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు మద్దుల శివశంకర ప్రసాద్, నేరెళ్ల లక్ష్మణ, కొలిశెట్టి రాము, వనమా కిరణ్, నిడుముక్కల శ్రీనివాసరావు, గాదెంశెట్టి రామకృష్ణ, గుడిపాటి రమణ, రంజిత్‌కుమార్, నటుకుల శ్రీరామ్, దివ్వెల రవి, మాజేటి పార్థసారధి, మేకల మోహనరావు, మాజేటి సత్యబాలాజీ, బోజనపల్లి తాండవ, పసుమర్తి మురళీ, నాగుబండి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలన అందరి బాధ్యత



టీబీ అవగాహనా ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది

మంగళగిరి సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కొద్దిపాటి జాగ్రత్తలు వహిస్తే క్షయ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని, క్షయ వ్యాధి నిర్మూలన కోసం ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని మంగళగిరి ప్రభుత్వ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ స్నేహరాజ్ కోరారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవం సందర్భంగా మంగళగిరి ప్రభుత్వ వైద్యశాల నుంచి ఎంటీఎంసీ కార్యాలయం వరకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ స్నేహరాజ్ మాట్లాడుతూ ప్రస్తుతం మంగళగిరి పట్టణ పరిధిలో 80 టీబీ కేసులు ఉన్నాయని, వారికి ఇంటి వద్దనే ఉచితంగా మందులు అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ అండ్ సీఈవో ప్రొఫెసర్ అహంతెం శాంతాసింగ్, ప్రొఫెసర్ శ్రీమంతకుమార్ దాస్, డాక్టర్ ధనుష్, హెడ్ నర్సు రమణకు మారి, టీబీ సూపర్‌వైజర్ సీతారామమూర్తి, కే శ్యామ్‌ప్రకాష్, ఎల్‌టీ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు. టీబీ నివారణా దినోత్సవం సందర్భంగా ఎయిమ్స్ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు పోస్టర్ రైటింగ్ పోటీలు నిర్వహించారు. కేకే మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని పలు బహుమతులను గెలుచుకున్నారు. విద్యార్థులను ఎయిమ్స్ వైద్యులు, పాఠశాల హెచ్ఎం అభినందించారు.

ఎన్నారై కళాశాలలో మెగా రక్తదాన శిబిరం

గుంటూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మేడికొండూరు సమీ పంలోని ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 80మందికి పైగా విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాస్ మాట్లాడుతూ సరైన సమయంలో రక్తం అందక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, రక్తదానం చేయడం వల్ల చాలా మంది ప్రాణాలను నిలిపినట్లు అవుతుందని అన్నారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్‌బాబు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల అనారోగ్యం భారిన పడతారన్నది కేవలం అపోహ మాత్రమేనని, దానం చేసిన వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని, గుండెపోటు ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చని క్యాన్సర్లు సోకే అవకాశాలు కూడా తగ్గుతాయని తెలిపారు. కార్యక్రమంలో సేకరించిన 80 యూనిట్ల రక్తాన్ని శ్రీవెల్ఫేర్ బ్లడ్ బ్యాంక్ వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీహరి, ఏవో బండారు. సీతా రామయ్య, వివిధ శాఖ అధిపతులు చంద్ర మౌళి, నాగేశ్వరావు తదితరులతో పాటు బోధనేతర సిబ్బంది, ఎన్ ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అభినందించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం నాయకులు

పెదనందిపాడు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోరుతు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు సోమవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామాలలో చైతన్యయాత్ర నిర్వహించినట్లు చెప్పారు. ఈ చైతన్య యాత్రలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, సమస్యలు తమ దృష్టికి తీసుకువచ్చారని ఎన్నికలలో కూటమి ప్రభుత్వం పేదలను ఆదుకునేందుకు ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా ఇంటి నిర్మాణాలు చేబడతామని కొత్త రేషన్ కార్డులు, ఇవ్వాలని ఇళ్ల నిర్మాణాలు, పించన్లతో పాటు సంక్షేమ పథకాలు అందజేయాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు, సభ్యులు దొప్పలపూడి రమేష్‌బాబు, కొత్త వెంకట శివరావు, జంపని రామారావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలి

తుళ్లూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పని విరామం సమయంలో జీతాలు చెల్లించాలంటూ తుళ్లూరు పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పారిశుధ్య కార్మికులకు రూ.21 వేలు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా నాయకులు బాబూరావు, ఎం రవి మాట్లాడుతూ ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తామని చెప్పి నెలల నెలలు జీతాలు పెండింగ్ పెట్టడం దారుణమన్నారు. కాంట్రాక్టు తీసుకున్న ఏజెన్సీ సంస్థలు రాజధానిలో పారిశుధ్య కార్మికులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. స్థానికులకు పని కల్పించే విధంగా ఉండాలని డిమాండ్ చేశారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

తాళం వేసిన ఇంట్లో చోరీ

పొన్నూరు టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటనపై చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ట్రైనీ ఐపీఎస్ అధికారి దీక్ష కథనం మేరకు చేబ్రోలు గ్రామానికి చెందిన షేక్ మొదీన బంధువులు గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నెల 22న బంధువులను పరామర్శించేందుకు మొదీన ఇంటికి తాళంవేసి వెళ్లారు. 23వ తేదీ మొదీన ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి ప్రధాన ద్వారం తాళం పగలకొట్టి ఉండడంతో పాటు బీరువా తాళాలు కూడా పగలకొట్టి ఉన్నట్లు గుర్తించారు. దీంతో మొదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీరువాలోని 30 గ్రాముల బంగారు ఆభరణాలు, 2 వెండి సామగ్రి, 20 వేల నగదు, చోరీకి గురైనట్లు మొదీన ఆదివారం ఫిర్యాదు చేశారు. ట్రైనీ ఐపీఎస్ దీక్ష పర్యవేక్షణలో చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

గ్రీవెన్స్‌కు 20 దరఖాస్తులు

తెనాలి అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 20 దరఖాస్తులు అందాయని రెవెన్యూ వర్గాలు తెలిపాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 12, పంచాయతీరాజ్, పోలీసు శాఖలకు మూడేసి దరఖాస్తులు, సబ్ రిజిస్టర్, హౌసింగ్ శాఖల సమస్యలపై ఒక్కో దరఖాస్తు అందాయని సంబంధిత అధికారులకు నివేదించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

పురపాలక సంఘానికి రెండు..

తెనాలి, మారీసుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో టౌన్ ప్లానింగ్ విభాగానికి రెండు అర్జీలు వచ్చాయన్నారు. ఈ సమస్యపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని కమిషనర్ శేషన్న తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శివన్నారాయణ, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి మూడు..

తెనాలి రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు మూడు అర్జీలు అందినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. సర్వే, మ్యుటేషన్ వంటి సమస్యలతో వచ్చినట్లు వెల్లడించారు. నిర్ణీత సమయంలోపు అర్జీలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. పలువురు వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరులో నాలుగు..

పొన్నూరు టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ జియావుల్ హక్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెవెన్యూ సంబంధిత అర్జీ 1, తాగునీటి శాఖ సమస్యపై 1, పురపాలక సంఘం పరిధిలో 2 సమస్యలు దాఖలయ్యాయి. ఈ కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మత మార్పిడిలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

గుంటూరు (తూర్పు), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పొన్నూరులోని తెలగపాలెం ప్రాంతానికి చెందిన కొందరు మత మార్పిడులకు పాల్పడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం గుంటూరు కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో హిందూ చైతన్య వేదిక సభ్యులు అర్జీ అందజేశారు. తాళ్లూరి రమేష్, తాళ్ళూరి పుల్లమ్మ, పెరువలి నాగేశ్వరరావు క్రైస్తవ మతాన్ని ప్రచారం చేస్తూ మత మార్పిడిలు చేస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హిందూ చైతన్య వేదిక సభ్యులు కొల్లు దుర్గాబాయి. వంగా నవీన్‌రెడ్డి, వీరయ్య చౌదరి, నాగేశ్వరరావు, వెంకటస్వామి తదితరులు అర్జీ అందచేశారు. ఆ ప్రాంతంలో చర్చిని ఏర్పాటు చేశారని, ఆ భవనానికి ఎటువంటి అనుమతులు లేవని ఉన్నతాధికారులు స్పందించి మత మార్పిడిలు చేస్తూ దేశ ఐక్యతకు భంగం కలిగిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని, అనుమతులులేని చర్చిలను నిర్వహించే భవనాలను కూల్చివేయాలని కోరారు.

డాక్టరేట్ పొందిన రజినికి సత్కారం

పొన్నూరు టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గరల్ చైల్డ్ డొమస్టిక్ వర్కర్స్ ఆర్థిక స్థితిగతులపై కోహూరి రజని పరిశోధనలు చేసి డాక్టరేట్ పొందడం అభినందనీయం అని దళిత ఉద్యమనేత డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. సోమవారం డాక్టరేట్ పొందిన రజని లుంబిని వనంలో డాక్టర్ కత్తి పద్మారావును కలుసుకున్నారు. డొమస్టిక్ వర్కర్ల స్థితిగతులపై ఆర్థిక శాస్త్రవేత్త కె.మధుబాబు పర్యవేక్షణలో రూపొందించిన విశ్లేషణను రజని పద్మారావుకు వివరించారు. కార్యక్రమంలో డాక్టరేట్ పొందిన రజనిని పద్మారావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కత్తి నళిని, చేతన్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

27న పొన్నూరు బార్ అసోసియేషన్ ఎన్నిక

పొన్నూరు టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) ఈ నెల 27వ తేదీన పొన్నూరు బార్ అసోసియేషన్ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి పిల్లి విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం పొన్నూరు బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదుల సమావేశం జరిగింది. ఎన్నికల అధికారిగా పిల్లి విజయ్‌కుమార్‌ను నియమించారు. ఈ నెల 26వ తేదీన నామినేషన్‌ల ప్రక్రియ 27న పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

తెనాలి ప్రాంత రూపురేఖలు మారుస్తాం

● తెనాలి-నారాకోడూరు-మంగళగిరికి నాలుగు వరుసల రహదారి

● బుర్రిపాలెం రోడ్డు విస్తరణ పనుల ప్రారంభోత్సవంలో మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి, మారీసుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చెందిన నగరాలకు దీటుగా తెనాలి ప్రాంత రూపురేఖలు మార్చనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. సోమవారం పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. స్థానిక శివాజీచౌక్‌లో రోడ్డు విస్తరణ పనులలో భాగంగా యడ్లపాటి వెంకట్రావ్ స్వాగత ద్వారంను తొలగించి నూతన ద్వారం ఏర్పాటుకు తలపెట్టిన కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ తెనాలి ప్రాంతానికి మాజీ ఎంపీ దివంగతనేత యడ్లపాటి వెంకట్రావు దేశం గర్వించదగ్గ నాయకుడిగా ఎనలేని సేవలు అందించారని తెలిపారు. ఆయన పేరుతో ఉన్న ద్వారాన్ని రోడ్ల విస్తరణలో భాగంగా ఆయన మనుమడు యడ్లపాటి తేజ సమక్షంలో తొలగింపు కార్యక్రమాలు చేపట్టామన్నారు. రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తిచేసిన అనంతరం తిరిగి దివంగత యడ్లపాటి వెంకట్రావ్ పేరున స్వాగత ద్వారం ఏర్పాటు చేసి ఆ మహనీయుడికి అంకితం చేస్తామన్నారు. తెనాలి, నారాకోడూరు, మంగళగిరి రోడ్లను నాలుగు వరుసల రోడ్లకు కృషిచేస్తున్నామని త్వరలోనే వాటి విస్తరణకు పనులకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. యడ్లపాటి తేజ మాట్లాడుతూ తన తాత దివంగత యడ్లపాటి వెంకట్రావ్ ప్రజల కోసం అనునిత్యం పరితపించే వారని తెనాలి అభివృద్ధికి ద్వారం తొలగించేందుకు తామంతా ఏకీభవించామని ప్రజలకు మంచి జరిగే ఏవిషయంలోనైనా తాము ముందుంటామని ఆయన స్పష్టంచేశారు. మంత్రి మనోహర్ తెనాలి ప్రాంత అభివృద్ధికి చేస్తున్న కృషికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి మనోహర్ మునిసిపల్ అధికారులతో కలసి యడ్లపాటి తేజను దుశ్శాలవాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, ట్రైనీ కలెక్టర్ పవార్ స్వాప్నిల్ జగనాథ్, తహసీల్దార్ గోపాలకృష్ణ, డీఎస్పీ బి.జనార్ధనరావు, సీఐలు మల్లికార్జునరావు, రమేష్ బాబు, కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఇన్‌చార్జ్ ఎంఈ శ్రీనివాసరావు, డీఈ శ్రీనివాసులు, ఏసీపీ శివన్నారాయణ, టీపీవో సాంబశివరావు, ఏఈలు సూరిబాబు, సునీల్ కుమార్, మునిసిపల్ అధికారులు, మెప్మా, సచివాలయ సిబ్బంది, ఆర్‌టీవో అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య వాహనాల ప్రారంభం

పచ్చదనం పరిశుభ్రతలతో తెనాలి ప్రాంతం విరాజిల్లేలా ప్రణాళికతో ముందుకు పోతున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం స్థానిక శివాజీచౌక్‌లో రూ. 2.60 కోట్లతో నూతనంగా కొనుగోలు చేసిన జేసీబీ, మూడు కంపాక్టర్లు, రెండు ట్రాక్టర్లను మంత్రి మనోహర్, ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ట్రైనీ కలెక్టర్ పవార్ స్వాప్నిల్ జగనాథ్, కమిషనర్ శేషన్న, ఇతర అధికారులు, కౌన్సిలర్లతో కలసి పూజలు నిర్వహించి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా తెనాలిని స్వచ్ఛ తెనాలిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అందులో భాగంగానే రూ.2.60 కోట్లతో నూతన పారిశుధ్య వాహనాలను కొనుగోలు చేయడం జరిగిందన్నారు.



రోడ్డు విస్తరణ పనులపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి మనోహర్, ఛైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న తదితరులు

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధన



త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పెదకాకాని, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో సద్గురు త్యాగరాజు స్వామి వారి షష్టమ ఆరాధన మహోత్సవాలను పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రారంభించారు. సోమవారం ఆయన జ్యోతి ప్రజ్వలనచేసి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ఆరంభించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణసంఘం నాయకులు పాల్గొన్నారు.

బాజీ బాబా దర్గా పోస్టర్ ఆవిష్కరణ

పెదకాకాని, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పెదకాకానిలోని దర్గా హజరత్ సయ్యద్ బాజిషాహీద్ అవులియా బాబావారి 537వ ఉరుసు మహోత్సవం వాల్ పోస్టర్‌ను పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యుడు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సోమవారం ఆవిష్కరించారు. పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామం మసీద్ దగ్గర రంజాన్ పండగ సందర్భంగా ముస్లింలకు ఇస్తున్న ఇఫ్తార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక నమాజ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరుకావాలి

● అధికారులకు తహసీల్దార్ సిద్ధార్థ ఆదేశం

కొల్లిపర, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు దరఖాస్తులు రావటంతో వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరం కోసమే ప్రతి సోమవారం ఈ వేదికను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. గ్రీవెన్స్‌లో పెట్టిన ప్రతి దరఖాస్తును పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రీవెన్స్‌కు హాజరైన వారిలో ఎంపీడీవో విజయలక్ష్మి, పంచాయతీ రాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి, ఈవో పీఆర్‌డీ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజానికి కృషి చేయాలి

● జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారులు

తెనాలి రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): టీబీ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి అన్నారు. సోమవారం వరల్డ్ టీబీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సింగ్ విద్యార్థులతో పట్టణంలో టీబీ వ్యాధి, చికిత్సపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పలువురు వైద్యశాల సిబ్బంది, టీబీ యూనిట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థుల ర్యాలీ

తెనాలి అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు సోమవారం క్షయ నివారణ దినోత్సవం నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో జరిగిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ సౌభాగ్యలక్ష్మి విద్యార్థులకు టీబీ వ్యాప్తికి కారణాలు, నివారణమార్గాలను వివరించారు. ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ, నందగోపాలకృష్ణ, భార్గవి, జ్యోతిబసు, కళ్యాణచక్రవర్తి పాల్గొన్నారు.

పొన్నూరులో...

పొన్నూరుటౌన్(చేబ్రోలు), మార్చి 24(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిని నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ అబ్రహంలింకన్ అన్నారు. చేబ్రోలు పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్షయ వ్యాధి నిర్మూలనకు పాటు పడతామని డాక్టర్లు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శైలజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి: ములకా

కొల్లిపర, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి వారిని అన్నివిధాలా ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని దావులూరులో ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా రైతులను, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ జొన్న, మొక్కజొన్న పంటలకు సంబంధించిన పనులు మార్చి నెలాఖరుకు అయిపోతాయన్నారు. ఏప్రిల్ నుంచి పనులు కోసం వెతుకులాట ప్రారంభించాల్సిన పరిస్థితి కూలీలకు ఏర్పడిందన్నారు. కూలీలకు పనులు కల్పించి అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోటా చంద్రశేఖర్, వెలుగు ముక్కంటి ఆరిమండ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఆత్మబంధువు సీఎం చంద్రబాబు

● నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ సదాశివం

పెదకాకాని, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీల అభ్యున్నతి కోసం ఏ ముఖ్యమంత్రి కృషిచేయని విధంగా నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తూ బీసీల ఆత్మబంధువుగా మారారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం చెప్పారు. సోమవారం పెదకాకానిలోని మండలం టీడీపీ కార్యాలయంలో రుద్రకోటి సదాశివం, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీలో బీసీల సంక్షేమం, అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషిని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీలను నమ్మించి నిట్ట నిలువునా ముంచిందన్నారు. బీసీ రక్షణ చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టారని, బీసీ విద్యార్థుల కోసం జిల్లా కేంద్రాలలో డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారని, త్వరలో 16,437 ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి చర్యలు చేపట్టారని తెలిపారు. బీసీలు అంతా టీడీపీ వెంటే ఉంటారని అన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మున్నంగీ శివశేషయ్య, నాయీ బ్రాహ్మణ సంఘ సీనియర్ నాయకులు ముక్కెర రాజు, నాదెండ్ల వెంకటేశ్వర్లు, అద్దంకి రవి, కొమ్మూరి తదితరులు పాల్గొన్నారు.



జీరో టీబీ కేసును సాధించిన సందర్భంగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ కొల్లి రజని

జీరో టీబీ కేసులపై సర్పంచులకు అవార్డులు

కొల్లిపర, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్షయ నియంత్రణ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని బొమ్మువానిపాలెం, కుంచవరం గ్రామాల్లో క్షయ వ్యాధి కేసులు పూర్తిగా లేకపోవడంతో సోమవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కుర్రా విజయలక్ష్మి, జిల్లా క్షయవ్యాధి నివారణాధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసరావు చేతులు మీదుగా సర్పంచ్‌లు కొల్లి రజనీ, శ్రీనివాసరావు అవార్డులు అందుకున్నారు. అవార్డు అందుకున్నందుకు సర్పంచ్‌లను కొల్లిపర మండల తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్‌డీ భార్గవ్‌లు అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు ప్రోత్సాహక బహుమతులు



పారిశుధ్య కార్మికులకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్న మంత్రి మనోహర్, ట్రైనీ కలెక్టర్ స్వప్నిల్ జగనాథ్ తదితరులు

తెనాలి, మారీసుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తెనాలి పురపాలక సంఘ పరిధిలో వివిధ వార్డుల్లో శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలకు నిర్వహించిన స్వచ్ఛ తెనాలి ఛాలెంజింగ్ పోటీలలో ప్రతిభ కనపరచిన కార్మికులకు ప్రోత్సాహక బహుమతులను మంత్రి మనోహర్ అందజేశారు. సోమవారం స్థానిక శివాజీచౌక్‌లో ఏర్పాటు చేసిన సభలో పురపాలక సంఘ పరిధిలోని మూడు వార్డుల్లో శానిటేషన్ నిర్వహణ పోటీలలో 8, 11, 22 వార్డుల శానిటేషన్ సిబ్బంది ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. ట్రైనీ కలెక్టర్ పవార్ స్వాప్నిల్ జగనాథ్ ఆలోచన మేరకు పట్టణంలో స్వచ్ఛ తెనాలి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ పవార్ స్వాప్నిల్‌ను దుశ్శాలవాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ రాధిక, మునిసిపల్ కమిషనర్ శేషన్న, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మునిసిపల్ భవన నిర్మాణానికి కృషి

వందేళ్ల చరిత్ర కలిగి శిథిలావస్థలో ఉన్న మునిసిపల్ భవనాన్ని నేలమట్టం చేసి అన్ని హంగులతో నూతన భవనాన్ని నిర్మించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పట్టణంలో ఇరుకుగా ఉన్న రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని భావితరాల భవిష్యత్‌కు ఒక అందమైన నగరంగా తెనాలిని తీర్చిదిద్దేందుకు ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. త్వరలోనే తిరిగి వార్డు పర్యటలను ప్రారంభించి వార్డు ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, ట్రైనీ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగనాథ్, కమిషనర్ బండి శేషన్న, మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

28 మందికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

తెనాలి రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యసమస్యలతో ఇబ్బందులు పడుతూ ఖరీదైన వైద్యాన్ని పొందేందుకు ఆర్థిక స్తోమతలేక సతమతమవుతున్న పేదల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. సోమవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఇటీవల వివిధ అనారోగ్య సమస్యలతో సీఎం సహాయనిధికి అర్జీలు పెట్టుకున్న 28మందికి రూ.19,23,481 విలువగలిగిన చెక్కులను మంత్రి నాదెండ్ల మనోహర్ పంపిణీ చేశారు. రాబోయే రోజుల్లో నియోజవర్గంలో ప్రతి పేద కుటుంబానికి అండగా నిలిచేలా కార్యాచరణతో ముందుకు సాగుతామని మనోహర్ స్పష్టం చేశారు.

ఇఫ్తార్‌లో పాల్గొన్న మనోహర్

పవిత్రమైన రంజాన్ మాసంలో ఏర్పాటుచేసే ఇఫ్తార్ విందులతో మతసామరస్యంతో పాటు సోదర భావం ఏర్పడుతుందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం పట్టణంలోని బోస్‌రోడ్డులో జిలానీఖాన్, ఫజల్‌ఖాన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొని స్వయంగా వడ్డించారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

● ఎమ్మెల్సీ ఆలపాటి



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని నందులపేటలో ఎస్‌కే నసీమ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని బోస్‌రోడ్డులో పాత గణేష్ హోటల్స్ సమీపంలో జిలానిఖాన్, ఫజల్‌ఖాన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. నిర్వాహక సభ్యులు, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

నందివెలుగులో చలివేంద్రం ప్రారంభం

తెనాలి రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివెలుగు మేముసైతం స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. సోమవారం గ్రామ ఎంపీటీసీ తిన్నలూరి విజయలక్ష్మి, తెనాలి డబుల్ హార్స్ ఎండీ మునగాల శ్యాంప్రసాద్, గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై నందివెలుగు కూడలిలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని, బ్రిడ్జివద్ద ఏర్పాటుచేసిన తాగునీటి పంపును ప్రారంభించారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక మారీసుపేట రెండు గేట్ల మధ్యలో రాయిపూడి నాగరాజు భార్య ఇద్దరు పిల్లలతో నివశిస్తున్నాడు. నాగరాజు ఆటోనగర్‌లోని ఓ స్టీల్ కంపెనీలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే క్రమంలో ఈ నెల 21వ తేదీన పనికని బయటకు వెళ్లి రాత్రయినా ఇంటికి రాలేదు. 22వ తేదీన భార్య శిరీషకు ఫోన్‌చేసి పనిమీద వెళ్లాను తిరిగివస్తానని తనకోసం వెతకవద్దని చెప్పాడు. బంధువులు తెలిసిన వారిని విచారించిన నాగరాజు ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం అతని భార్య శిరీష పోలీసులను ఆశ్రయించింది. శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగపర్చుకోవాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగించుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, చెముడుబాడు, తూములూరు, కొల్లిపర, అన్నవరం తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు. కూలీలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే కూలీలకు కొలతలు బట్టి వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అలకానంద, మృత్యుంజయరావు, ఫీల్డ్ అసిస్టెంట్ వల్లభాపురం బుజ్జిబాబు, సాగర్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పెదకాకాని తోటలో పసిపాప

● పోలీసులకు అప్పగించిన తోట నిర్వాహకులు



పెదకాకాని, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బిడ్డ భారమైందో ఏమో గాని ఓ మహిళ నెలల పసిపాపను వదిలేసి వెళ్లిన సంఘటన పెదకాకాని తోట (స్వస్తితశాల)లో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... కాకాని తోటలో ప్రతి సోమవారం ప్రార్థనలు జరుగుతూ ఉంటాయి. జరిగే సమయంలో గుర్తు తెలియని మహిళ పాపని తన వెంట తీసుకుని వచ్చి తోటలో ప్రార్థనకు కూర్చొని ఆ పసిపాపను వదిలి పెట్టి పోయింది. తోట నిర్వాహకులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి సంరక్షణ నిమిత్తం గుంటూరు సీడబ్ల్యూసీ వారికి ఆ పసిపాపను అందజేశారు.

దావులూరిపాలెంలో ఆక్రమణలు తొలగించాలని వినతి

కొల్లిపర, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): డొంకరోడ్డు ఆక్రమణకు గురైందని దీంతో రైతులు అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని మండల పరిధిలోని దావులూరిపాలెంకు చెందిన రైతులు సోమవారం మండల కేంద్రం కొల్లిపర తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సిద్దార్థను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. శ్రీగంగానమ్మగుడి, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం దగ్గర నుంచి కొత్తబొమ్మువానిపాలెం వెళ్లే రోడ్డు వరకు పూర్తిగా ఆక్రమణకు గురికావడంతో రైతులు తమ పంటలను గృహాలకు తీసుకు వెళ్లాలంటేనే నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని వెంటనే సర్వేచేయించి తమకు న్యాయం చేయాలని దావులూరిపాలెం గ్రామస్థులు తహసీల్దార్‌ను కోరారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు కొండా కిశోర్‌రెడ్డి, సర్పంచ్ దొంతగాని రవిశ్రీను, భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు వాసా శివనాగమల్లేశ్వరరావు, తోట శ్రీనివాసరావు, కోనా శివ నాగేశ్వరరావు, వాసా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.